
ఆంధ్రజ్యోతి
5
తిరుపతి
జిల్లా వార్తలు
సోమవారం 23 సెప్టెంబరు 2024



నెయ్యి కొనుగోళ్లలో రూ.500 కోట్ల స్కాం

టీటీడీ లెక్కల ప్రకారం కిలో నెయ్యి రూ.320. అది కల్తీ నెయ్యి కావడంతో దాని వాస్తవధర రూ.120. దీంతో ఒక కిలోపై రూ.200 పక్కదారి పట్టించారు. ఆ ప్రకారం మూడేళ్లలో కేవలం నెయ్యి కొనుగోళ్లలోనే దాదాపు రూ. 500 కోట్ల కుంభకోణం జరిగింది. చిరుతను తరిమేందుకు అప్పటి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి కర్రలను తెప్పించడంలోనూ భారీ స్కాం జరిగింది. వీటిపై శ్రీవారి భక్తులు ఆందోళన చేపట్టాలి.



- కిరణ్ రాయల్, జనసేన తిరుపతి ఇన్‌చార్జి

సంప్రోక్షణతో శుద్ధి చేసేశాం

కల్తీ నెయ్యి దోషాన్ని ఆగస్టులో సంప్రోక్షణతో పోగొట్టి శుద్ధి చేశాం. దీనిపై భక్తులకు ఎలాంటి ఆపోహలు వద్దు. ఇంకా కొందరిలో ఆందోళనలు ఉండటంతో సోమవారం ఉదయం శాంతిహోమం చేస్తున్నాం. ఇప్పుడు పేరున్న సంస్థల నుంచే స్వచ్ఛమైన ఆవు నెయ్యి కొని లడ్డూ ప్రసాదాలు తయారు చేస్తున్నాం. తిరుమలలో ఇది వరకు నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందా లేదా అనే పరీక్షలు జరగలేదు. ఇక్కడ సాధారణ పరీక్షల సామర్థ్యమే ఉంది.



- శ్యామలరావు, టీటీడీ ఈవో



నెయ్యి కల్తీ అంటూ కుట్ర

మా పాలనలో టీటీడీలో ఏవేవో జరిగిపోయాయని చంద్రబాబు విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. ఏ ఆధారాలూ దొరక్క పోవడంతో నెయ్యి కల్తీ అంటూ కుట్ర చేస్తున్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదాలపై కల్తీ ముద్ర వేసి అపచారానికి పాల్పడ్డారు. ఒకవేళ తిరుమల లడ్డూ కల్తీ జరిగుంటే బాధ్యులు రక్తం కక్కుకుని చావాలని శ్రీవారిని కోరుకుంటున్నా.



- భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్

పవిత్రత గురించి ఆయన మాట్లాడటమా?

నల్లరాయిని చెప్పుతో కొట్టండని గతంలో మాట్లాడిన వ్యక్తి టీటీడీ చైర్మన్ అయ్యారు. తన కుమారుడిని ఎమ్మెల్యేని చేసేందుకు పనుల పేరిట టీటీడీ నిధులు దుర్వినియోగం చేశారు. అలాంటాయన పవిత్రత గురించి మాట్లాడటమా? వారి పాలనలో అక్రమాలు జరిగుంటే నెత్తురు కక్కుకొని చస్తామని ఆయన చెప్పారు. ఆ శిక్షనూ దేవుడు త్వరలోనే వేస్తాడు. శ్రీవారి పవిత్రతను కాపాడినందుకే బాంబుదాడి నుంచి చంద్రబాబును దేవుడు రక్షించాడు.



- నరసింహయాదవ్, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు

శ్రీవారి లడ్డూ కల్తీ బాధాకరం

'తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తాం. కళ్లకద్దుకుని తీసుకుంటాం. అలాంటి లడ్డూ అపవిత్రమైందని తెలిసి ఎంతో బాధ కలిగింది. లడ్డూ కల్తీ వ్యవహారం భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉంది. దీనికి కారకులైన వారిని శిక్షించాలి' అని సినీ నటుడు బాలాజీ కోరారు. హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే దేనినీ సహించబోమన్నారు. ఈ మేరకు ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన టీడీపీ నేత జగన్నాథం తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు.

- తిరుపతి(లీలామహల్)



ప్లకార్డు చూపుతున్న సినీ నటుడు బాలాజీ తదితరులు



ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు



మృతిచెందిన బాబు



మృతిచెందిన జగదీశ్వర్



మృతిచెందిన వెన్నెలమేఘన

అయ్యో.. దేవుడా..!

- పుణ్యక్షేత్రాలను దర్శించుకుని వస్తుండగా ప్రమాదం
- ఆగి ఉన్న లారీని కారు ఢీకొని ముగ్గురి మృతి
- ఏడుగురికి గాయాలు

మృతులు, క్షతగాత్రులు నెల్లూరు వాసులే



చికిత్సపొందుతున్న లక్ష్మమ్మ, కిషోర్‌బాబు

చిల్లకూరు, సెప్టెంబరు 22: ఇద్దరు స్నేహితులతో కలిసి ఆ కుటుంబం పుణ్యక్షేత్రాలను దర్శించుకుని తిరుగు ప్రయాణమైంది. మరో అరగంటలో గమ్యం చేరనున్న క్రమంలో చిల్లకూరు వద్ద అదుపు తప్పిన వీరి కారు ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో నెల్లూరుకు చెందిన ముగ్గురు మృతిచెందగా, మరో ఏడుగురు గాయపడ్డారు.



గాయపడిన కళ్యాణి

పోలీసులు తెలిపిన ప్రకారం.. నెల్లూరురూరల్ మండలం కాకుపల్లి గ్రామానికి చెందిన గోనెల బాబు(50), అతడి భార్య లక్ష్మమ్మ చిన్నపాటి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి కిషోర్ బాబు, కళ్యాణి, మాధవి పిల్లలు. వీరిలో కళ్యాణి నెల్లూరులోని వనంతోపులో ఉండగా, ఆమెకు వెన్నెల మేఘన(8), జశ్వంత్ పిల్లలు. ఈ కుటుంబ సభ్యులు, తమ సమీప బంధువు రాధాకుమారి, నెల్లూరుకే చెందిన బాబు కుటుంబ స్నేహితులైన సునీల్‌కుమార్, జగదీశ్వర్(45) కలిసి ఈనెల 18న పుణ్యక్షేత్రాల సందర్శనకు సునీల్‌కుమార్ కారులో వెళ్లారు. కాణిపాకం, కంచి, అరుణాచలం పుణ్యక్షేత్రాలకు వెళ్లి దైవదర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో ఆదివారం వేకువన చిల్లకూరు పోలీస్‌స్టేషన్ ఎదురుగా వచ్చే సమయానికి కారు అదుపుతప్పి రోడ్డు పక్కన నిలిపి ఉన్న కంటైనరు లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో తాత, మనవరాలైన బాబు, వెన్నెల మేఘన, జగదీశ్వర్ మృతిచెందారు. లక్ష్మమ్మ, మాధవి, కళ్యాణి, కిషోర్‌బాబు, రాధాకుమారి, సునీల్‌కుమార్, జశ్వంత్‌లకు గాయాలయ్యాయి. వీరికి గూడూరు ఏరియా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందాఇంచి.. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. సంఘటనా స్థలాన్ని సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, డీఎస్పీ రమణకుమార్ పరిశీలించారు. ఈ మేరకు ఎస్‌ఐ సురేష్‌బాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, డీఎస్పీ రమణకుమార్

'చిత్తూరు-తచ్చూరు' ఎక్స్‌ప్రెస్‌వే బాధితుల్లో నేనూ ఒకడిని



కారూరు గ్రామం వద్ద ఎక్స్‌ప్రెస్ వే పై వంటావార్పు కార్యక్రమంలో నారాయణ తదితరులు

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

పిచ్చాటూరు, సెప్టెంబరు 22: చిత్తూరు-తచ్చూరు ఎక్స్‌ప్రెస్ హైవే బాధితుల్లో తానూ ఒకడినని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు.పిచ్చాటూరు మండలం కారూరు గ్రామం వద్ద ఆదివారం స్థానిక రైతులతో కలసి హైవేపై ధర్నా నిర్వహించారు. అధికారులు హైవేకు భూములు ఇచ్చిన రైతులకు అన్యాయం చేస్తున్నారంటూ రోడ్డుపై వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడారు. 'నగరి మండలంలోని అయనంబాకంలో నా రెండెకరాల భూమిని ఎక్స్‌ప్రెస్ వేలో కోల్పోయా. మన ప్రాంతంలో ఎక్స్‌ప్రెస్ వే వస్తుండడంతో ఆనందపడి భూములిచ్చా. తీరా రైతులకు, గ్రామానికి వెళ్లే ప్రయాణికులకు తీరని నష్టం చేకూర్చారు. పొలాలకు వెళ్లాలంటే దారి సౌకర్యం లేదు. ఎక్స్‌ప్రెస్ వే కొండలా అడ్డంగా ఉంది. చెరువు నుంచి నీళ్లు వచ్చే కాలువలను కాంట్రాక్టర్లు పూడ్చి వేశారు. గ్రామస్థులకు, రైతులకు కలిగే అసౌకర్యాలపై నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ కార్తీక్ దృష్టికి తీసుకెళ్లా. ఢిల్లీ స్థాయి అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని కోరా. స్థానికులకు న్యాయం జరిగే వరకు ఈ పోరాటం ఆగదు. కారూరు గ్రామం వద్ద సర్వీస్ రోడ్డు, సబ్‌వే, కూల్చిన డంపింగ్ యార్డు నిర్మాణం వెంటనే చేపట్టాలి. రోడ్డు వెంబడి గ్రామాల వద్ద అండర్ పాస్, పై ఓవర్లు నిర్మించే వరకు అంచలంచెలుగా పోరాటం చేస్తూనే ఉంటా' అని స్పష్టంచేశారు. సీపీఐ నాయకులు చిన్నిరాజు, హరికృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని కాలినడక భక్తురాలి మృతి

పాకాల, సెప్టెంబరు 22: పాదయాత్రగా తిరుమల శ్రీవారి దర్శనానికి వస్తున్న తమిళనాడుకు చెందిన భక్తబృందంలోని ఓ మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. అక్కడికక్కడే ఆమె మృతిచెందారు. పాకాల మండలం శంఖంపల్లె ఆంజనేయస్వామి ఆలయ సమీపాన ఆదివారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. వేలూరు జిల్లా గుడియాత్తం మండలం నుంచి భక్తబృందం శనివారం రాత్రి ఆలయ ఆవరణలో సేదతీరింది. ఆదివారం తెల్లవారుజామున కాలినడక ప్రారంభించగా.. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తాటిమానుపల్లెకు చెందిన సరళ అక్కడికక్కడే మృతిచెందారు. భర్త జయపాల్‌తో కలిసి ఈమె 23 ఏళ్లుగా కాలినడకన తిరుమలకు వస్తున్నారు. కళ్లముందేభార్య మృతి చెందడంతో ఆయన కన్నీరుమున్నీరయ్యారు. సీఐ మద్దయ్య ఆచారి, ఎస్‌ఐ మహేష్‌బాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సరళ మృతదేహం వద్ద విషణ్ణ వదనాలతో భక్తులు

వైభవంగా ఘటోత్సవం



జనసందోహం నడుమ ఊరేగుతున్న ఘటుం కుండలు

వెంకటగిరి, సెప్టెంబరు 22 వెంకటగిరిలో బుధ, గురువారాల్లో నిర్వహించే పోలేరమ్మ జాతరకు కీలక ఘట్టంగా భావించే ఘటోత్సవం ఆదివారం జరిగింది. ఉదయం 10 గంటల సమయంలో కాంపాళెం వద్ద రెడ్డిగారి సాంగ్యంగా చెప్పుకొనే అమ్మవారి బలి దున్నపోతును పనిబాటలవారికి అప్పగించారు. మధ్యాహ్నం కుమ్మరి వారి పుట్టినింటిసాంగ్యంగా అమ్మవారి అత్తింటివారైన చాకలివారికి రెండుకుండలు, దీపం పట్టే మూకుడిని అప్పగించారు. వీటిని అమ్మవారి అత్తవారిల్లుగా భావించే జీనిగుల వారి వీధిలోని చాకలింట వడ్లను పోసి వాటిపై ఘటుంకుండలను కొలువుతీర్చారు. బలిజ సామాజిక, పత్రోళ్లు తొలిపూజ చేశారు. అనంతరం మండపం ముందు అమ్మవారి ప్రతిరూపంగా భావించే బలిదున్న పోతుకు స్నానం చేయించి పూజలు చేసి పసుపు గుడ్డను కప్పారు. ఘటుం కుండలకు భక్తులు పూజలు చేసి అంబలి, పెరుగన్నం, బెల్లపు గడ్డలు, పొంగలిని వీటిలో వేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆ ప్రాంతమంతా ఆసాదుల తప్పెట్లు, యువత కేరింతలతో హోరెత్తింది. అనంతరం ఘటుం కుండలను చాకలివారు నెత్తిన పెట్టుకొని.. ముందు బలి దున్నపోతును ఈ ఏడాది వాహనంపై ఎక్కించి ఊరేగింపుగా పోలేరమ్మ దేవస్థానం వద్దకు తీసుకొచ్చారు. అమ్మవారికి బలిదున్నపోతును చూపి పూజలు చేశారు. తిరిగి ఘటుం కుండలు, బలి దున్నపోతు ఊరేగింపు మొదలైంది. అప్పటి రాజాల వంటశాల వద్ద వడ్లను పోసి వాటిపై ఘటుం కుంవడలు కొలువు తీర్చారు. నగరినుంచి వచ్చిన సారెలతో వచ్చిన రాజాల అనుచరులు కుండలకు పూజలు చేశారు. ఘటుంకుండల దర్శనానికి యువత పోటీ పడటంలో కొంత తోపులాట జరిగింది. ఇక్కడ్నుంచి బయలుదేరి పట్టణంలో తొలిసారిగా తాటిపర్తి వారింటికి చేరుకోగా.. అక్కడ చాకలివారి కాళ్లు కడిగి ఘటుంకుండలకు పూజలు చేశారు. అక్కడ్నుంచి అనవాయతీగా వెళ్తున్న ఇళ్లకు ఘటుంకుండలు వెళ్లడం పూజలందుకోవడం సంప్రదాయం. ఇలా మూడు రోజులపాటు ఘటుంకుండలు, బలిదున్నపోతు ఊరిలో తిరుగుతూ పూజలందుకుంటాయి. ఈ ఘటోత్సవానికి ఎన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున భక్తులు హాజరై ఊరేగింపులో చిందులు వేశారు, సీఐ ఏవీ రమణ, ఎస్ఐ సుధాకర్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

- ఎప్పుడూ లేనివిధంగా ఈ ఏడాది బలిదున్న పోతు, ఘటుం కుండలను వాహనంపై ఊరేగింపునకు తీసుకురావడం విమర్శలకు తావిచ్చింది. సంప్రదాయాన్ని పక్కన పెట్టారంటూ బలిదున్న పోతు ఎక్కించిన వాహనాన్ని కొందరు అడ్డుకొన్నారు.
- రాజాల వంటశాల వద్దకు బలి దున్నపోతును ఈ ఏడాది తీసుకు రాలేదు. ఈ ఆచారానికి మంగళం పాడారు.
- ఘటోత్సవంలో ఆకతాయిల ఆగడాలతో మహిళలు ఇబ్బందులు పడ్డారు.





వాహనంలో ఊరేగుతున్న అమ్మవారి బలి దున్నపోతు

అప్పుడు.. ఇప్పుడూ వాళ్లే!

- రుయాస్పత్రిలో రాత్రికి రాత్రే దుకాణం ఆక్రమణ
- వైసీపీ నుంచి జనసేనలో చేరిన నేత అండతో దాష్టీకం
- అడ్డుకున్న అధికారులకు ఎమ్మెల్యే పేరిట బెదిరింపులు

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రుయాస్పత్రిలోని దుకాణాలను గుట్టుచప్పుడు కాకుండా టెండరు పేరుతో తమ విధేయులకే కట్టబెట్టారు. దీనికిగాను ఒక్కో దుకాణదారుడి నుంచి రూ.లక్షల్లో వసూలు చేసినట్లు అప్పట్లో విమర్శలు వచ్చాయి.

ఇటీవల కూటమి అధికారంలోకి వచ్చింది. వెంటనే వైసీపీలోని ఓ యువనేత తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును ప్రసన్నం చేసుకుని జనసేనలో చేరిపోయారు. వెంటనే రుయాలో కమిటీ పదవి పొందారు. నాలుగు రోజుల కిందట జరిగిన హెచ్‌డీఎస్ సమావేశంలో తొలిసారి పాల్గొన్నారు. ఆ వెంటనే తన అనుచరుల ద్వారా ఓ దుకాణాన్ని ఆక్రమించేశారు. అడ్డుకున్న అధికారులను ఎమ్మెల్యే పేరు చెప్పి బెదిరించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు సాగిన దందాను ఇప్పుడూ కొనసాగిస్తున్నారు.



రుయాస్పత్రిలోని సూపరింటెండెంట్ గది వెనుక 2000వ సంవత్సరంలో రెడ్డెప్ప ఒక చిన్న బంకు పెట్టుకొని జీవనం సాగించారు. కొన్నాళ్లకు ఆయన ఆరోగ్య పరిస్థితి బాగోలేక ఆ దుకాణాన్ని కృష్ణమూర్తికి సబ్‌లీజు కింద ఇచ్చారు. ఐదేళ్ల కిందట రెడ్డెప్ప మృతిచెందగా.. సబ్‌లీజుకు తీసుకున్న కృష్ణమూర్తికి చెందిన వారే ఆ బంకులో వ్యాపారం చేసుకునేవారు.టెండర్లు, నిబంధనలు లేకుండా కొనసాగుతున్న దుకాణాలను రద్దుచేసి 2022లో కొత్తగా టెండరు కింద కేటాయించారు. ఆ సమయంలో ఈ బంకును టెండరు కింద తేజ్‌ప్రకాశ్ దక్కించుకున్నారు. వ్యక్తిగత కారణాలతో ఆయన వ్యాపారం మొదలు పెట్టలేదు.అప్పట్నుంచి ఆ దుకాణం ఖాళీగా ఉంది. దీంతో కృష్ణమూర్తి కోర్టును ఆశ్రయించి ఆ దుకాణంపై రెడ్డెప్ప పేరిట స్టే తీసుకొచ్చారు. రెడ్డెప్ప మృతిచెందడం.. ఆయనకు వారసులు లేకపోవడంతో ఆ స్టే చెల్లదని అప్పట్లోనే అధికారులు తేల్చిచెప్పేశారు. అప్పట్నుంచి ఆ దుకాణం ఖాళీగా ఉంది.పక్క దుకాణాల వారు ఇక్కడ ఫ్రిజ్‌లు, ఇతర వస్తువులను పెట్టుకునేవారు. రెండు రోజుల కిందట రెడ్డెప్ప వారసులమంటూ జనసేన యువనేత (ఇటీవల వైసీపీ నుంచి చేరిన వ్యక్తి) అనుచరులు కొందరు ఆ దుకాణాన్ని ఒకే రాత్రిలో ఆక్రమించేశారు. అందులోని తమ వస్తువులు ఇవ్వాలని పక్క దుకాణదారులు ప్రాధేయపడినా ఇవ్వలేదు. మరుసటి రోజు నుంచే వ్యాపారం మొదలు పెట్టారు.

దీని జోలికొస్తే ఇబ్బందులు తప్పవంటూ..

రుయాస్పత్రిలోని దుకాణాన్ని కొందరు ఆక్రమించారని తెలిసి అధికారులు అక్కడకు వెళ్లారు. 'ఎవరు మీరు. దుకాణంలో ఎందుకు ఉన్నారు' అని అడగ్గా ఏదైనా ఉంటే ఎమ్మెల్యేతో మాట్లాడండంటూ దుకాణంలోని వారు చెప్పారు. దుకాణంలోని వాళ్ల సమాచారంతో జనసేనలోని యువనేత అక్కడికి వచ్చారు. 'వాళ్లు మన వాళ్లే. మీరు సపోర్టు చేయండి. ఏదైనా ఉంటే ఎమ్మెల్యేతో మాట్లాడతా. లేకపోతే ఇబ్బందులు తప్పవు' అంటూ ఆయన సున్నితంగా అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. దుకాణం కావాలంటే వచ్చే నెలలో టెండర్లు పిలుస్తామని అప్పుడు దక్కించుకోవాలే కానీ, ఇలా ఆక్రమించడం నేరమని అధికారులు చెప్పారు. ఆ టెండర్లో దుకాణాలన్నీ తమకే వస్తాయని, ప్రస్తుతానికి దీని జోలికి రావద్దని, వస్తే ఇబ్బందులు తప్పవని గట్టిగా మందలించడంతో అధికారులు వెనుదిరగాల్సి వచ్చింది. రెండు రోజులుగా ఆక్రమించిన దుకాణంలో వ్యాపారం సాగుతోంది.

- తిరుపతి (వైద్యం)

ఖాళీ చేయమన్నా లెక్క చేయడంలేదు

ఈ విషయంపై సూపరింటెండెంట్ రవిప్రభును వివరణ కోరగా.. 'మాకు తెలియకుండా దుకాణం ఆక్రమించిన మాట వాస్తవమే. వెంటనే ఖాళీ చేయాలని ఆదేశించినా.. వాళ్లు లెక్క చేయలేదు. ఎప్పుడో మృతిచెందిన వ్యక్తి పేరుతో ఉన్న కోర్టు స్టేని చూపుతున్నారు. చట్టపరంగా ఆ దుకాణానికి, వీళ్లకు ఎటువంటి సంబంధం సంబంధం లేదు. వెంటనే ఖాళీ చేయకపోతే పోలీసులకు ఫిర్యాదు చేసి వారి సాయంతో ఆక్రమణదారులను వెళ్లగొట్టి దుకాణం స్వాధీనం చేసుకుంటాం.

చంద్రగిరి

వారాహి మహారథ యాత్ర ప్రారంభం



రథయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 22: వారాహి మహారథ యాత్రను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. ఆదివారం జీవకోనలో లింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఆయన రథయాత్రను ప్రారంభించారు. అమ్మవారికి ఆదివారాహి శక్తిపీఠం మహారుద్ర వారాహి స్వామి పూజలు చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సంకల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లపై వారాహి అమ్మవారి ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆరణి ఆకాంక్షించారు. రథయాత్రను ఆది వారాహి శక్తి పీఠం, త్రిశక్తి వారాహి శక్తి పీఠం సంయుక్తంగా నిర్వహించాయి. విశాఖ వరకు యాత్ర కొనసాగనుంది. కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మబ్బు దేవ నారాయణ రెడ్డి, కార్పొరేటర్ అన్నా అనితా, కృష్ణయాదవ్, బాల, జనసేన నాయకులు భానుచౌదరి, గోపిరాయల్, తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో అదరహో ఫ్యాషన్ షో



తిరుచానూరు, సెప్టెంబరు 22: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు పాశ్చాత్య సంస్కృతిని మేళవించి రూపొందించిన వస్త్రాలను పరిచయం చేస్తూ తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం రాత్రి విన్నర్ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించిన ఫ్యాషన్‌షో ఆకట్టుకుంది. యువతులు ర్యాంప్‌పై క్యాట్‌వాక్‌తో ఆకర్షించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పర్యాటకశాఖ అధికారి రూపేందర్‌రెడ్డి, శిల్పారామం ఏవో ఖాదర్ వల్లీ మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో ఫ్యాషన్‌పై మక్కువతో సాంప్రదాయాన్ని మరచిపోతున్న క్రమంలో యవతకు పాత సాంప్రదాయాలను గుర్తు చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. అంతకు ముందు వారు జ్యోతి ప్రజ్వలనతో ఫ్యాషన్‌షోను ప్రారంభించారు. ఉమశ్రీ బృందం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో విన్నర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనర్ డైరెక్టర్ వెంకటేష్, జియో ఈవెంట్స్ నిర్వాహకులు సందీప్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.68 కోట్లు

తిరుమల, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.68 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. టీటీడీ ఈ వివరాలను ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 82,406 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 31,151 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

మహిళలకు అండగా కూటమి ప్రభుత్వం



సుధారెడ్డికి స్వాగతం పలుకుతున్న టీడీపీ మహిళా శ్రేణులు

చంద్రగిరి, సెప్టెంబరు 22: పట్టణంలోని ఎంఎస్ఆర్ కళ్యాణ మండపంలో ఆదివారం నియోజకవర్గ మహిళలతో ఎమ్మెల్యే సతీమణి పులివర్తి సుధారెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రగిరిలో 30 సంవత్సరాల చరిత్రను తిరగరాయటంలో మహిళలు కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. గత పాలకుల దోపిడీని దౌర్జన్యాలను ఎండగట్టడంలో ప్రముఖంగా వ్యవహరించారన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టు సమయంలో మహిళా కవాతు నిర్వహించి తాడేపల్లి ప్యాలస్‌ను కదిలించారన్నారు. మహిళలకు ప్రత్యేక స్థానం కల్పించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఎంతో మంది మహిళలు ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలకు అన్ని విధాలా అండదండలు అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలువురు మహిళలు పాల్గొన్నారు

శ్రీవారిమెట్టు మార్గంలో విజయానందతీర్థ స్వామి



చంద్రగిరి, సెప్టెంబరు 22: తిరుమల శ్రీవారి దర్శనార్థం మైసూరు దత్త పీఠాధిపతి విజయానందతీర్థస్వామి శ్రీవారి మెట్టు మార్గంలో తిరుమలకు కాలినడకన వెళ్ళారు. ఆదివారం ఉదయం శ్రీవారి మెట్టు వద్ద కల్యాణ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని కాలినడకన తిరుమలకు వెళ్ళారు. పలువురు స్వామిజీలు, అధికారులు ఆయన వెంట ఉన్నారు.

బస్ సర్వీసులు లేక అనుపల్లెవాసుల అవస్థలు



ఆర్‌సీపురం వద్ద నిలిచిపోయిన చవటగుంట బస్సు

రామచంద్రాపురం, సెప్టెంబరు 22: తిరుపతి నుంచి అనుపల్లె మీదుగా బయలుదేరిన చవటగుంట బస్సు ఆర్‌సీపురం వద్ద ఆదివారం మరమ్మతులకు గురై ఆగిపోయింది. బస్‌లో 50మంది ప్రయాణికులు ఉన్నారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఐదేళ్ల క్రితం వరకు అనుపల్లెకు తిరుపతి, పుత్తూరు, చిత్తూరు ఆర్టీసీ డిపోల నుంచి పదికి పైగా బస్సులు నడిచేవి. తర్వాత వివిధ కారణాలతో అన్ని సర్వీసులు నిలిచిపోయాయి. ప్రస్తుతం తిరుపతి నుంచి అనుపల్లె మీదుగా చవటగుంటకు ఒక బస్సు మాత్రమే నాలుగు ట్రిప్పులు నడుస్తోంది. దీంతో వ్యాపారస్థులు, విద్యార్థులు, దినసరి కూలీలు, ఉద్యోగస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాయలచెరువు కట్టపై నుంచి అనుపల్లె వరకు 70కి పైగా గ్రామాలున్నాయి. గత సర్వీసులను బస్సులను పునరుద్ధరిస్తే ఉపయోగంగా ఉంటుందని ప్రయాణికులు కోరుతున్నారు.

తిరుమలకు కాలినడకన తమిళ భక్తులు



రామచంద్రాపురం, సెప్టెంబరు 22: తమిళనాడులోని ఆర్కేపేట, షోలింగర్, రాణిపేట నుంచి తిరుమలకు 500 మందికిపైగా భక్తులు ఆదివారం కాలినడకన తరలివెళ్లారు. వీరంతా శుక్రవారం బయలుదేరి రాయలచెరువుకట్ట భవానీ జలకంటేశ్వరాలయం వద్దకు ఆదివారం ఉదయం చేరుకున్నారు. కొంతసేపు విశ్రాంతి తీసుకుని భవానీ జలకంతేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తర్వాత తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో విజయం సాధించాలి

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 22: త్వరలో జరగనున్న కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించాలని మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి తమ పార్టీ కార్పొరేటర్లకు దిశా నిర్దేశం చేశారు. ఆదివారం సాయంత్రం తమ నివాసం వద్ద పార్టీ కార్పొరేటర్లతో సమావేశాన్ని నిర్వహించారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు కీలకంగా వ్యవహరించాలన్నారు. వైసీపీ అభ్యర్థులను బలపరిచి విజయం సాధించేలా చూడాలని సూచించారు. సమావేశంలో ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, భూమన అభినయ్ రెడ్డి, పార్టీ కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

త్వరలో కోల్డ్ స్టోరేజి ఏర్పాటు: నాని

భాకరాపేట, సెప్టెంబరు 22: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం నెల్లుట్లవారిపల్లె పంచాయతీ బొమ్మైచెరువుపల్లెలో ఆదివారం జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఇప్పటికే సామాజిక భద్రతా పింఛన్లను పెంచి పంపిణీ చేసిందన్నారు. నిరుద్యోగులకు డీఎస్సీ ప్రకటించిందన్నారు. రైతులకు రాయితీ విత్తనాలు పంపిణీ చేస్తున్నామన్నారు. తలకోన నుంచి వృథాగా పోతున్న నీటిని చెరువులకు అనుసంధానం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. రెండు మండలాలకు కలిపి కోల్డ్ స్టోరేజి ఏర్పాటు చేస్తామన్నారు. చిన్నగొట్టిగల్లు మండలంలో డ్రైనేజ్ కాలువల నిర్మాణానికి రూ.2.20 కోట్లు మంజూరయ్యాయన్నారు. పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీమంతం కార్యక్రమంలో పాల్గొని సారె అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సోమశేఖర రెడ్డి, తహసీల్దారు జనార్దన్ రాజు, వైస్ ఎంపీపీ సునీత దామోదరం, టీడీపీ నాయకులు బెల్లంకొండ మురళీ, శివకుమార్,మదనమోహన, చిట్టెమ్మ, ఆర్వీ రమణారెడ్డి, సుబ్రహ్మణ్యం, మోహన్‌రెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, కృష్ణమూర్తి, చంద్రశేఖర్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రావారిపాలెం: అవినీతి లేని పాలన చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ఉస్తికాయలపెంట పంచాయతీలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెడ్డివారిపల్లి, పరమటపల్లి, కంసాలపల్లి, ఎగువ హరిజనవాడ పొలాలకు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పారదర్శకంగా, అవినీతి రహితంగా పాలన చేస్తున్నారన్నారు. మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మహేష్ నాయుడు, మధుసూదన్, చిన్నపరెడ్డి, కొమ్మక లక్ష్మీదేవి, వెంకట శివరామిరెడ్డి, విశ్వనాథరెడ్డి, చిట్టిబాబు నాయుడు పాల్గొన్నారు.



సీమంతం సారెను అందిస్తున్న ఎమ్మెల్యే నాని

టీటీడీ పవిత్రతనూ మంట కలిపారు: టీడీపీ

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 22: నల్లరాయిని చెప్పుతో కొట్టండని గతంలో మాట్లాడిన వ్యక్తికి శ్రీవారిపై నమ్మకం ఎలా ఉంటుందని తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్ ప్రశ్నించారు. తిరుపతిలోని తన నివాసంలో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవస్థలను నిర్వీర్యం చేయడంతో పాటు కల్తీ నెయ్యితో టీటీడీని, శ్రీవారి లడ్డూ పవిత్రతనూ మంటకలిపారని ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా భక్తుల మనోభావాలను దెబ్బతీశారన్నారు. తన ఆర్థిక ప్రయోజనాల కోసం టీటీడీని వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి, కరుణాకర్ రెడ్డి చేతికి జగన్ అప్పగించి టీటీడీని భ్రష్టుపట్టించారన్నారు. కల్తీ నెయ్యి విషయం బయటకు రావడంతో మాజీ ఎమ్మెల్యే, అప్పటి టీటీడీ ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి మాట్లాడటం చూస్తుంటే విడ్డూరంగా ఉందన్నారు. గతంలో శ్రీవారిని నిందించిన ఈయన.. తన కుమారుడిని ఎమ్మెల్యే చేసేందుకు టీటీడీలో అనేక అక్రమాలకు పాల్పడి నిధులను దుర్వినియోగం చేశారన్నారు. గోవిందరాజ సత్రాల నిర్మాణాల పేరుతోనే దాదాపు రూ.540 కోట్లు పక్కదోవ పట్టించిన మాట వాస్తవం కాదా అని ఆయన ప్రశ్నించారు. తాతయ్యగుంట గంగమ్మ గుడి నిర్మాణం ఎందుకు అర్ధంతరంగా నిలిపేశారో చెప్పాలని డిమాండు చేశారు. మీరు చేసిన తప్పులకు తిరుపతి చరిత్రలో లేని విధంగా 64 వేల ఓట్లతో నీ కుమారుడి ఓటమే నిదర్శనమన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో శ్రీవారికి మీరు చేసిన పాపానికి రాష్ట్రంలో మీ ప్రభుత్వం 11 సీట్లకే పరిమితమైన విషయం గుర్తుంచుకోవాలన్నారు. పాపాలన్నీ చేసేసి ఇప్పుడు ప్రెస్‌మీట్‌లు పెట్టి ఆ శ్రీవారిపై భక్తితో భగవద్గీత కోటి పుస్తకాలను పంపిణీ చేశామని చెబుతున్నారు కాదా ఆ పుస్తకాలు ఎవరికి పంపిణీ చేశారో చెప్పాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, పార్లమెంటు కార్యాలయ కార్యదర్శి మనోహరాచారి, జిల్లా కార్యదర్శి యశ్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీలో రూ.వేల కోట్ల స్కాం: కిరణ్

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 22: అలిపిరి తనిఖీ కేంద్రం టోకన్ నుంచి నెయ్యి కొనుగోళ్ల వరకు.. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో టీటీడీలో రూ.వేల కోట్ల స్కాం జరిగిందని జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ ఆరోపించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వీటిపై సమగ్ర విచారణ జరపాలన్నారు. జగన్ పాలనలో చివరి మూడు సంవత్సరాలుగా లడ్డూ తయారీలో కల్తీ జరిగిందని విమర్శించారు. 'నెయ్యి తేడాగా ఉంది, వాసన రావడంలేదని ఎప్పటి నుంచో పోటు అధికారులు హెచ్చరిస్తున్నా అప్పటి పాలకులు పట్టించుకోలేదట. మూసుకొని మీ పనిచూసుకోండని బెదిరించారట. భక్తుల మనోభావాలతో ఆడుకుంటే ఊరుకోం. దీనిపై మఠాధిపతులు, పీఠాధిపతులు స్పందించకుండా ఏంచేస్తున్నారు? బాధ్యులపై చర్యలు తీసుకునేంతవరకు జనసేన పోరాడుతుంది' అని చెప్పారు. సినీనటుడు ప్రకాశ్‌రాజ్ వ్యాఖ్యలను పట్టించుకోమని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు.



నెయ్యి నాణ్యతలో రాజీ ప్రసక్తే లేదు: ఎమ్మెల్యే మురళి

తిరుమల, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ప్రసాదాల్లో వినియోగించే నెయ్యి నాణ్యత విషయంలో రాజీపడేది లేదని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. కల్తీకి కారణమైన వారిని విడిచిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఆయన ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. నెయ్యిలో కల్తీ జరగడం కోట్లాది మంది హిందు భక్తుల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. ప్రభుత్వ విచారణలో నిజాలన్నీ వెలుగులోకి వస్తాయన్నారు. తిరుమలలోని అన్నివిభాగాల్లో ప్రక్షాళన జరుగుతోందన్నారు.

కల్తీని శ్రీవారే బయటపెట్టారు: సుగుణమ్మ

తిరుమల, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూప్రసాదాల్లో జరిగిన నెయ్యి కల్తీని వెంకటేశ్వరస్వామే బయట పెట్టించారని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అన్నారు. ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో తిరుమలలో అనేక అపశ్రుతులు జరిగాయన్నారు. ఆనాలోచితంగా, అహంకారంతో పరిపాలించారన్నారు. ఎవరు చెప్పినా పట్టించుకోలేదన్నారు. నెయ్యి కల్తీ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేస్తోందన్నారు. లడ్డూ నాణ్యతపై నమ్మకం పెంచేందుకు సీఎం చంద్రబాబు అనేక చర్యలు తీసుకుంటున్నారన్నారు.



సిటీ ఛాంబర్ సేవలు అభినందనీయం : ఆరణి





డాక్టర్ మమతను సత్కరిస్తున్న అతిథులు - ఆమూరు సుబ్రమణ్యంను సత్కరిస్తున్న నిర్వాహకులు

● పలువురికి పురస్కారాల ప్రదానం

తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 22: సిటీ ఛాంబర్ అందిస్తున్న సేవలు మరువలేనివని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఉదయం మహతి వేదికగా పలు రంగాలలోని ప్రముఖులకు పురస్కారాలు అందజేశారు. సేవా రంగంలో డి.రామకృష్ణ, కె.బి.రాంగోపాల్, కొత్తపల్లి మునిరత్నంలను జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించారు. అలాగే డాక్టర్ ఎ.బాలసుబ్రమణ్యం, సాయిబాబు, డాక్టర్ రామకృష్ణమూర్తి, డాక్టర్ బి.మమత, డాక్టర్ ఎం.ఉమ ముద్దుబాల, ఎస్.ప్రియాంక, వి.పద్మావతి, కె.ఖాదర్ వల్లిలకు ఉగాది-24 పురస్కారాలు, పి.జనార్దన్, మారియా తనీమ్, మాధురి, కావ్యశ్రీలకు ప్రత్యేక గౌరవ పురస్కారాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కోవిడ్ సమయంలో సిటీ ఛాంబర్ వలస కార్మికులను ఆదుకున్న విధానం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని అభిలషిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యే ఎ.మోహన్, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు పోకల అశోక్ కుమార్, టీడీపీ సీనియర్ నేత కోడూరు బాలసుబ్రమణ్యం, ఛాంబర్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్, ఉపాధ్యక్షుడు స్టాన్లీ జయకుమార్, కార్యదర్శి షణ్ముగం యాదవ్, నిర్వాహకులు కె.ఎస్.వాసు, కరుణానిధి, స్వరాజ్యలక్ష్మి, వేణు, గుండాల గోపినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ ఈఈగా రామ్మోహన్

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 22: పంచాయతీరాజ్ తిరుపతి డివిజన్ ఈఈగా ఎం.రామ్మోహన్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల బదిలీల్లో భాగంగా పులివెందుల డివిజన్ ఈఈగా పనిచేస్తున్న ఈయన్ను తిరుపతి బదిలీ చేసింది. ఇప్పటి వరకూ ఇక్కడా ఈఈగా పనిచేసిన చంద్రశేఖర్‌రెడ్డి కడపకు బదిలీ అయ్యారు.

సమగ్ర బీసీ కులగణనకు త్వరలో రిలే దీక్షలు



సమావేశంలో బీసీ నాయకులు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు) సెప్టెంబరు 22: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే సమగ్ర బీసీ కులగణన చేపట్టాలని పలు సామాజిక వర్గాల నేతలు కోరారు. ఓ బీసీ మేలుకో-నీ లెక్కలు తేల్చుకో అనే నినాదంతో స్థానిక అంబేడ్కర్ భవన్‌లో విద్యార్థి, ఉద్యోగ, యువజన, వివిధ కుల సంఘాలతో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. బీసీ సమగ్ర కులగణనకు భవిష్యత్‌లో రాష్ట్రవ్యాప్తంగా రిలే దీక్షలు చేయాలని సమావేశం తీర్మానించింది. ఇందులో బీసీ మేధావుల జాతీయ ఫోరం నాయకుడు వెంకటనారాయణ, ఏపీ బీసీ ఉద్యోగుల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు టిగోపాల్, పీడీ సుధాకర్, బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు భాస్కర్, బీసీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు సురేష్, వంకీపురం పవన్, ,ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు ప్రసాద్‌రావు,అదినారాయణ, .భాస్కర్ యాదవ్ ,బీసీ విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు





జస్టిస్ కృష్ణకుమార్, జస్టిస్ దండపాణి - కలెక్టర్లు వెంకటేశ్వర్, సుమిత్‌కుమార్

తిరుమల, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. తమిళనాడు హైకోర్టు తాత్కాలిక న్యాయమూర్తి జస్టిస్ డీ కృష్ణకుమార్, న్యాయమూర్తి జస్టిస్ దండపాణి, ఎమ్మెల్యే కూన రవి కుమార్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు.

సమస్యలున్నాయి..దృష్టి పెట్టండి



అక్కారంపల్లి వద్ద మురుగునీరు

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 22: తమ ప్రాంతంలో సమస్యలు తిష్ట వేసి ఉన్నాయని, వాటిపై దృష్టి పెట్టాలని నగర పరిధిలోని ఒకటవ డివిజన్ సుబ్బారెడ్డి నగర్ వాసులు కోరుతున్నారు. కాలనీలోని శ్రీవారి వీధి దగ్గర రోడ్డు గుంతలమయంగా ఉందని, పైపులైను కోసం మధ్యలో తవ్వి వదిలేశారని తెలిపారు. ప్యాచ్ వర్క్ చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అక్కారంపల్లి వద్ద తిరుప్పావై మార్గం నిర్మాణంలో భాగంగా కాలువను అసంపూర్తిగా వదిలేశారని, మురుగునీరు చేరి దోమలకు ఆవాసంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా దుర్వాసన వెదజల్లుతోందన్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.



సుబ్బారెడ్డినగర్‌లో గుంతలమయంగా ఉన్న రోడ్డు

అమ్మవారి సేవలో ఉడిపి పీఠాధిపతి



తిరుచానూరు, సెప్టెంబరు 22: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని ఆదివారం ఉడిపిలోని శ్రీకృష్ణపుర మఠాధిపతి విద్యాసాగర తీర్థ స్వామిజీ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా విద్యాసాగర స్వామిజీ ఆలయ ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు ఆయనను అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, సూపరింటెండెంట్ కేపీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సోదరిపైనే అత్యాచారం

● నిందితుడిపై పోక్సో కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 22: కంచే చేనుమేసినట్లు... చిన్నారిపై పెద్దమ్మ కుమారుడే అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదుతో ఆదివారం అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు. అలిపిరి సీఐ రామకిషోర్ తెలిపిన ప్రకారం.. 8వ తరగతి చదివే ఓ పన్నెండేళ్ల బాలిక కుటుంబం తిరుపతి అర్బన్ మండలంలో నివాసం ఉంటోంది. బతుకుదెరువుకోసం బాలిక తండ్రి బెంగళూరులో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. కొన్ని నెలలక్రితం బాలికను ఇక్కడే అమ్మమ్మ ఇంట్లో ఉంచి ఆమె తల్లి కూడా పనుల నిమిత్తం బెంగళూరు వెళ్లారు. అమ్మమ్మతోపాటు కలిసి ఉంటున్న పెద్దమ్మ కుమారుడు, 20 ఏళ్ల యువకుడు.. వరుసకు చెల్లెలైన చిన్నారిపై కన్నేశాడు. అమ్మమ్మ, అతడి అమ్మ ఇంట్లో లేనప్పుడు బలవంతంగా బెదిరించి ఆమెపై అఘాయిత్యానికి పాల్పడటం మొదలు పెట్టాడు. అమ్మనాన్న కూడా దగ్గర లేకపోవడంతో ఏంచేయాలో.. ఎవరికి చెప్పాలో తెలియక ఆమె భరిస్తూ వచ్చింది. ఇటీవల తల్లి తిరుపతికి రావడంతో తనపై జరుగుతున్న అఘాయిత్యాన్ని ఆ చిన్నారి తెలియజేసింది. దీంతో బాలిక తల్లి ఆదివారం అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమేరకు ప్రాథమికంగా విచారించి నిర్ధారించుకున్న సీఐ రామకిషోర్ యువకుడిపై పోక్సో కేసు నమోదుచేశారు.

కామధేను వాహనంపై గణనాథుడి చిద్విలాసం



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 22: కాణిపాకం క్షేత్రంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా గణనాథుడు కామధేను వాహనంపై ఆదివారం విహరించాడు. ఈ కార్యక్రమానికి కాణిపాకానికి చెందిన నాయీ బ్రాహ్మణ వంశస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామికి ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేకం చేసి, శోభాయమానంగా అలంకరించాక భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి ఉభయదారులు ఉభయ వరస తీసుకు రావడంతో ఆలయ కల్యాణ వేదికపై స్వామివారి ఉత్సవర్లకు పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవర్లను కామధేను వాహనంపై ఉంచి కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. కాగా, ఆలయ ఆస్థాన మండపంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమాల్లో ఈవో గురుప్రసాద్, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రవి,ఉభయదారులు పాల్గొన్నారు. ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా సోమవారం సూర్యప్రభ వాహనసేవ నిర్వహించనున్నారు.

నీటిట్యాంకు కింద పార్కింగ్



నీటి ట్యాంకు కింద పార్కింగ్ చేసిన వాహనాలు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 22: రైల్వేకాలనీలో భారీ నీటి ట్యాంకును ఇటీవల ప్రారంభించారు.ట్యాంకు కింద భాగం వాహనాలకు ఉచిత పార్కింగ్ స్థలంగా మారిపోయింది. ప్రహరీ గోడ కూలి ఉన్నా పట్టించుకోవడంలేదు. ట్యాంకు కింద చుట్టూ వ్యర్థాలతో నిండిపోయింది. దుర్వాసన వస్తోంది. స్థానికులు దోమల దాడికి గురవుతున్నారు. నగర పాలక సంస్థ దీని నిర్వహణ బాధ్యతను గాలికొదిలేయడం విమర్శలకు తావిస్తోంది.

పేద విద్యార్థుల ఉన్నతికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 22: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల ఉన్నతికి టీచర్లు కృషి చేయాలని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఏటీ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. గౌరవ అతిథిగా హాజరైన డీఈవో డాక్టర్ వి.శేఖర్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థ బలోపేతానికి ఇటువంటి సదస్సులు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, సమాజ శ్రేయస్సుకు సంఘాలు కృషి చేయాలని ఆకాంక్షించారు. సంఘ రాష్ట్ర అదనపు కార్యదర్శి చెంగల్రాయ మందడి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల విలీనంపై స్పష్టత ఇవ్వాలని, జీవో 117 రద్దుకు చొరవ చూపాలని కోరారు. జాతీయ చీఫ్ పాట్రాన్ కె.సుబ్బారెడ్డి మాట్లాడారు.

ఆకట్టుకున్న కాన్సియన్స్

- రాజ్వికి స్పార్క్ ఆఫ్ ది ఇయర్ అవార్డు



రాజ్వికి స్పార్క్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందజేస్తున్న ఎమరాల్డ్స్ డైరెక్టర్ గిరిధర్, పక్కనే మునిరత్నం

తిరుపతి(విద్య), సెప్టెంబరు 22: ఎల్‌బీసీ రోడ్డులోని ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సర విద్యార్థుల్లో ఆంగ్లభాషా సామర్థ్యాన్ని పెంచేందుకు కాన్షుయెన్స్-2కే24 పేరిట వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. టాక్‌దిటాక్, లిజన్‌అప్, ఫిక్షన్-డిక్షన్, ఇంక్‌క్రాఫ్ట్ వంటి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. స్పార్క్ ఆఫ్ ది ఇయర్ అవార్డును బీబీఏ ప్రథమ సంవత్సర విద్యార్థి రాజ్వి కైవసం చేసుకుంది. లిజన్‌అప్‌లో ఇషికజైన్, ప్రతిభానాయుడు, టాక్‌దిటాక్‌లో రాజ్వి, కీర్తనగ్రేస్, ఫిక్షన్-డిక్షన్‌లో లాస్య ఆనంద్, పృథ్వీరాజ్, ఇన్క్‌క్రాఫ్ట్‌లో శైలు, షేక్‌జసీర ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారని అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.మునిరత్నం పేర్కొన్నారు. విద్యార్థులకు డైరెక్టర్లు కె.విశ్వనాథ్, ఇ.గిరిధర్ అవార్డులు ప్రదానం చేశారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రయోగాలపై శిక్షణ ఇవ్వాలి

తిరుపతి(విద్య), సెప్టెంబరు 22: ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని జూనియర్ కళాశాలల్లో జనరల్ సైన్స్, వొకేషనల్ కోర్సులు చదివే విద్యార్థులు తప్పనిసరిగా ప్రయోగ తరగతులు నిర్వహించాలని ప్రాంతీయ ఇంటర్మీడియట్ బోర్డు పర్యవేక్షణాధికారి(ఆర్‌ఐవో) జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ విషయమై ఈ నెల 4న జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు నిర్వహించిన సమావేశంలో వివరించామని తెలిపారు. ఏ కళాశాలలోనైనా ప్రాక్టికల్స్ నిర్వహించడంలేదని సమాచారం అందితే బోర్డు నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎస్వీయూ ఫిజిక్స్ విశ్రాంతాచార్యుడికి విశిష్ట గుర్తింపు



జయశంకర్‌ను అభినందిస్తున్న ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 22: ప్రపంచ అగ్రశ్రేణి శాస్త్రవేత్తల జాబితాలో ఎస్వీయూ ఫిజిక్స్ విభాగ విశ్రాంత ప్రొఫెసర్ సీకే జయశంకర్ చోటు సంపాదించుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఈ విశిష్ట గుర్తింపు వరుసగా ఐదో సారి పొందడం విశేషం. సైన్స్ బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో జయశంకర్ చేసిన విశేష కృషికి ఈ గుర్తింపు దక్కింది. స్కోపస్ ఇండెక్స్‌లో పొందుపరిచిన ఆయన పరిశోధన ప్రగతి నివేదికను పరిశీలించిన స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ ఈ గుర్తింపును ప్రకటించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా గుడిపాల మండలం చలిచీమలపల్లెకు చెందిన ప్రొఫెసర్ సీకే జయశంకర్ అలాహాబాదులో గల నేషనల్ సైన్స్ అకాడమీలోనూ ఫెలోగా, ఎస్వీయూ రెక్టార్‌గా సేవలు అందించారు. యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఆయన్ను అభినందించారు.

భావితరాల కోసం మొక్కలు నాటాలి



స్విమ్స్ ఆవరణలో మొక్కలు నాటుతున్న డైరెక్టర్ ఆర్వీకుమార్

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 22: భావితరాల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి, సంరక్షించాలని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్విమ్స్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆదివారం స్విమ్స్‌లో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. డైరెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ రోజు మనం నాటే మొక్కలు భావితరాల భవిష్యత్తును ఆరోగ్యంగా తీర్చిదిద్దుతాయని పేర్కొన్నారు.

ఎస్వీయూ అడ్మిషన్ల విభాగానికి నూతన సారథ్యం

- నేడు కొత్త అధికారుల బాధ్యతల స్వీకరణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 22: ఎస్వీయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ (డీఓఏ) విభాగానికి నూతన అధికారులు సారథ్యం వహించనున్నారు. ఇప్పటి వరకూ డీవోఏ డైరెక్టర్‌గా ఇంజినీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ శ్రీమురళి వ్యవహరించారు. సోమవారం ఆయన ఆ బాధ్యతల నుంచి వైదొలగనున్నారు. నూతన డీవోఏ డైరెక్టర్ వర్సిటీ సౌత్ ఈస్ట్ ఏషియన్ అండ్ పసిఫిక్ స్టడీస్ (సీప్) ప్రొఫెసర్ పూకా రమేష్‌బాబు, జాయింట్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ మధు (జియాలజీ), అసిస్టెంట్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ శంకర గణేష్ (ఫైన్ ఆర్ట్స్ విభాగం) నియమితులయ్యారు. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు ఉత్తర్వులు వెలువరించారు. సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

3న పవన్‌కల్యాణ్ తిరుపతి రాక?

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 22: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కుటుంబ సమేతంగా శ్రీవారి దర్శనార్థం అక్టోబర్ 3న తిరుపతి రానున్నట్లు పార్టీ జిల్లా యంత్రాంగానికి ప్రాథమిక సమాచారం అందింది. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా తిరుపతికి రానున్న ఆయనకు ఘనంగా స్వాగతం పలకడానికి నాయకులు, కార్యకర్తలు సన్నాహాలు మొదలుపెట్టారు.

మేనిఫెస్టో ఆవిష్కరణ



మేనిఫెస్టోను ఆవిష్కరిస్తున్న నేతలు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 22: టీటీడీ ఎంప్లాయీస్ బ్యాంకు ఎన్నికలలో భాగంగా చీర్లకిరణ్ ప్యానల్ మ్యానిఫెస్టోను ఆదివారం ఆవిష్కరించారు. ప్యానల్‌కు మద్దతు తెలిపిన ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు సమీర్ ప్యానల్ సభ్యులు గుంటూరు రేఖ, వంకీపురం పవన్, సునీల్‌కుమార్ యాదవ్, మణికంఠలను అభినందించారు. టీటీడీ ఉద్యోగులు వీరికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అమరేంద్ర, నరసింహులు, రేవంత్, మధు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ పీడీగా శోభన్‌బాబు



తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 22: తిరుపతి జిల్లా డీఆర్‌డీఏ పీడీగా టి.ఎన్.శోభన్‌బాబును నియమిస్తూ ఆదివారం రాత్రి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు విడుదల చేశారు. ఆయన ప్రస్తుతం చిత్తూరు జిల్లా నగరి క్లస్టర్ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(డ్వామా) ఏపీడీగా పనిచేస్తున్నారు. ఆరు నెలల క్రితం డీఆర్‌డీఏ పీడీగా పనిచేస్తున్న జ్యోతి ఉద్యోగ విరమణ పొందారు. అప్పటి నుంచి ఇన్‌చార్జి పీడీగా ప్రస్తుతం ఏపీడీగా ఉన్న ప్రభావతి విధులు నిర్వహిస్తున్నారు. శోభన్‌బాబు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ చంద్రగిరి, వడమాల, రామచంద్రాపురం ప్రాంతాల్లో ఎంపీడీవోగా పనిచేశానని, జిల్లాపై అవగాహన ఉందని అన్నారు. శ్రీవారి చెంత పనిచేయడం సంతోషంగా ఉందన్నారు.

రెగ్యులర్ డీపీవోగా సుశీలాదేవి



తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 22: తిరుపతి జిల్లా గ్రామ పంచాయతీ ఆఫీసర్‌గా సుశీలాదేవిని నియమిస్తూ పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆమె డీఎల్‌డీవోగా విధులు నిర్వహిస్తున్నారు. రెండున్నర నెలలుగా ఇన్‌చార్జి డీపీవోగా వ్యవహరిస్తున్నారు. ఎట్టకేలకు రెగ్యులర్ డీపీవోగా సుశీలాదేవిని నియమించారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం అందించే పథకాలను ప్రజలకు చేరువ చేస్తామని ఆంధ్రజ్యోతితో చెప్పారు.

వకుళమాతా.. మన్నించు!

- లడ్డూ తయారీలో కల్తీ నెయ్యిపై బీజేపీ నేతల వేడుకోలు



చేతులెత్తి వేడుకుంటున్న బీజేపీ నేతలు రమేష్‌నాయుడు, నవీన్‌కుమార్‌రెడ్డి, పురుషోత్తం నాయుడు - నిరసన తెలుపుతున్న హిందూ ఉపాధ్యాయ సమితి అధ్యక్షుడు మహేష్

తిరుపతిరూరల్, సెప్టెంబరు 22: తిరుమల శ్రీవారి లడ్డు, ప్రసాదాల తయారీలో గత వైసీపీ పాలకులు కమీషన్లకు కక్కుర్తిపడి కల్తీ నెయ్యిని వినియోగించి హిందూ భక్తుల మనోభావాలను దెబ్బతీశారంటూ బీజేపీ నేతలు నాగోతు రమేష్‌నాయుడు, నవీన్‌కుమార్‌రెడ్డి, పురుషోత్తంనాయుడు ఆరోపించారు. శ్రీవారి లడ్డూను అపవిత్రం చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని ప్రార్థిస్తూ తిరుపతి రూరల్ మండలం పేరూరులో ఉన్న వకుళమాత ఆలయం వద్ద భక్తులతో కలసి ఆదివారం కొబ్బరికాయలు కొట్టి మన్నించు తల్లీ అంటూ వేడుకున్నారు. వారు మాట్లాడుతూ శ్రీవారి తల్లిగా తిరుమలకొండపై ఆలయంలో ఉన్న వకుళామాత అన్నప్రసాదాల పోటు సంరక్షకురాలుగా ఉంటూ స్వామి వారికి తయారు చేసే నైవేద్యం, ప్రసాదాలను నిరంతరం పర్యవేక్షిస్తుందని చరిత్ర చెబుతుందని, అమ్మవారి కళ్లు కప్పి అపవిత్రమైన నెయ్యిని వినియోగించి స్వామివారితో పాటు భక్తులకు లడ్డు, ప్రసాదాలను అందించిన దుర్మార్గులను శిక్షించాలని కోరారు. దీన్నిబట్టి చూస్తే శ్రీవారికి భక్తులు కానుకలుగా సమర్పించిన వజ్రవైఢూర్యాలతోపాటు కోట్లాది రూపాయల బ్యాంకు డిపాజిట్లను కూడా మాయం చేశారన్న అనుమానాలు కలుగుతున్నాయని ఆరోపించారు. తిరుమల పవిత్రతను కాపాడాలంటూ నినాదాలు చేశారు. విష్ణువర్ధన్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, నరేష్‌కుమార్‌నాయుడు, జీఎస్‌ప్రేమ్, చిన్నా, రమేష్, ప్రసన్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీనెయ్యి కారకులను కఠినంగా శిక్షించాలి

తిరుపతి(గాంధీరోడ్డు): తిరుమల శ్రీవారి ప్రసాదంలో కల్తీనెయ్యిని వినియోగించడానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ డేగల కోరారు. స్థానిక గాంధీరోడ్డు సర్కిల్‌లో హిందూ సంఘాల ప్రతినిధులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ జంతువుల కొవ్వు కలసిన నెయ్యిని వినియోగించడం అపచారమని, దీనిపై సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రమాదేవి, వజ్రాల చంద్రశేఖర్, కిరణ్, అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ కల్తీ సూత్రధారులను శిక్షించాలి



మాట్లాడుతున్న సీనియర్ నేత ఆముదాల శ్రీహరి

తిరుపతి(లీలామహల్): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీకి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని టీడీపీ సీనియర్ నేత ఆముదాల శ్రీహరి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ తాను నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నానని, గత వైసీపీ పాలనలో ఉన్నంత నికృష్టమైన ఈవోను, చైర్మన్లను ఇంతవరకు చూడలేదని దుయ్యబట్టారు. లడ్డూ కల్తీలో వైసీపీ వారే ప్రథములని, వారికి తగిన బుద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు.

సమాజాభివృద్ధిలో టీచర్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు, వేదికపై అపుస్మా నేతలు - అవార్డులు పొందిన టీచర్లతో విశ్వనాథరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు

తిరుపతిరూరల్, సెప్టెంబరు 22 : సమాజాభివృద్ధిలో టీచర్ల పాత్ర చాలా కీలకమైందని, అందుకే వారికి సముచిత గౌరవం లభిస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. జాతీయ సంస్కృత వర్సిటీ ఆడిటోరియంలో ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్(అపుస్మా)జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్మెల్యేతో సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి కలసి మాట్లాడారు. దిశానిర్దేశకులైన టీచర్లకు అవార్డులను ప్రదానం చేసే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కాగా జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు సంబంధించి 600 మంది టీచర్లను పురస్కారాలతో సన్మానించారు. డీఈవో డాక్టర్ వి.శేఖర్, డీవైఈవోలు బాలాజి, ప్రభాకర్‌రాజు, శ్రీధర్స్ అకాడమీ చైర్మన్ మద్దినేని శ్రీధర్, డైరెక్టర్ శ్రీవాణి, అపుస్మా నేతలు డాక్టర్ ఎన్. విశ్వనాథరెడ్డి, డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు, నరసింహారెడ్డి, పోలిరెడ్డి, రవీంద్రనాథరెడ్డి, వెంకటరమణారెడ్డి, సంగరాజు భాస్కరరాజు, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల జూడో పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 22: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్)అండర్ 14 అంతర్ జిల్లా బాలబాలికల జూడోపోటీలు ఆదివారం సాయంత్రం స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. డీఈవో డాక్టర్ వి.శేఖర్, డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్, అండర్ 19 ఎస్జీఎఫ్ కార్యదర్శి జయరామయ్య ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. అర్ధరాత్రి వరకు అన్ని జిల్లాల మధ్య లీగ్ దశ పోటీలు జరిగాయి. సోమవారం నాకౌట్ మ్యాచ్‌లతో ప్రారంభమై తుది పోరుతో ముగియనుంది. అనంతరం విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్స్ ప్రదానం చేయనున్నారు.

కాలువ స్థలంలో అక్రమ నిర్మాణం



కాలువ స్థలంలో నిర్మిస్తున్న రేకుల షెడ్డు

తిరుపతిరూరల్, సెప్టెంబరు 22: తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీ విద్యానగర్ కాలనీలో సర్వే నెంబరు 518లోని కాలువ స్థలంలో ఆక్రమణదారులు రేకులషెడ్డు నిర్మాణం చేపడుతున్నారు. తిరుపతి-చంద్రగిరి జాతీయ రహదారికి సమీపంలో విలువైన ఈ కాల్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాన్ని చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీఆర్వోకి ఈ విషయం తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని అంటున్నారు. మండల రెవెన్యూ అధికారవర్గాలు స్పందించి కాలువ స్థలాన్ని కాపాడాలని కోరుతున్నారు. కాగా వీఆర్వోని వివరణ కోరగా తమకు అందిన సమాచారం మేరకు స్థలాన్ని సందర్శించి నిర్మాణాన్ని నిలుపుదల చేశామని తెలిపారు.

రోడ్డుకడ్డంగా డ్రైవింగ్ స్కూల్ వాహనాలు



తిరుపతి అర్బన్, సెప్టెంబరు 22: కరకంబాడీ మార్గం శ్రీనివాససేతు ర్యాంపు పక్కన ఉన్న డ్రైవింగ్ స్కూల్ వాహనాలను రోడ్డుకు అడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. అసలే ఇరుకైన రోడ్డు కావడం, వాహనాలను అక్కడే పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఒక్కోసారి రోడ్డు పొడవునా వాహనాలు బారులు తీరుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

బోర్డు పెట్టినా వ్యర్థాలు పడేస్తాం



తిరుపతి అర్బన్, సెప్టెంబరు 22: తిరుపతి గ్రామీణ మండలం మంగళం పరిధిలోని ఆర్టీవో కార్యాలయం పక్కవీధిలో వ్యర్థాలు వేస్తే రూ.1000 జరిమానా అంటూ పంచాయతీ అధికారులు బోర్డు పెట్టినా ప్రజలు లెక్కచేయడం లేదు. యథావిధిగా వ్యర్థాలను పడేస్తున్నారు. అవి వర్షానికి కుళ్లి దుర్వాసన వస్తోంది. దోమల బెడద ఎక్కువవుతోంది. పారిశుధ్య విభాగ అధికారులు దీనిపై దృష్టి సారించాల్సి ఉంది.

సెంట్రల్ బస్టాండులో.. దొంగలున్నారు..జాగ్రత్త!

- ఆరు నెలల్లో 90 చోరీలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 22: తిరుపతి సెంట్రల్ బస్టాండులో దొంగలు తిష్టవేసి ఉన్నారు. అలైటింగ్ పాయింట్ల(బస్సులు దిగే ప్రాంతాలు)ను టార్గెట్‌గా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. పైకి యాత్రికులు లాగా కనిపిస్తూ ఆదమరపుగా ఉండే వారి సెల్‌ఫోన్లు, బ్యాగులు, డబ్బు కొట్టేస్తున్నారు. ఆరు నెలల వ్యవధిలో 90 చోరీలు జరిగాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. యాత్రికుల భద్రత కోసం ఏర్పాటు చేసిన పోలీసు అవుట్ పోస్టు నిరుపయోగంగా మారిందన్న ఆరోపణలున్నాయి. 24 గంటలు ప్రయాణికులకు భద్రత కల్పించాల్సిన పోలీసులు ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో చోరులతో పాటు బస్టాండులో గంజాయి బ్యాచ్ ఆగడాలతో భయానక పరిస్థితి నెలకొంది. ఉన్నత స్థాయి అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

నడక దారేదీ?

- కరకంబాడి రోడ్డుకిరువైపులా ఆక్రమణలే



ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన దుకాణాలు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 22: కరకంబాడి రోడ్డులో ఇరువైపులా పాదచారుల కోసం ఏర్పాటు చేసిన స్థలమంతా ఆక్రమణకు గురైంది. ఆ రోడ్డు కనిపించినంత దూరం తాత్కాలిక దుకాణాలు వందలాదిగా వెలిశాయి. ఆ రోడ్డులో వాహనాలు రద్దీగా నడుస్తుంటాయి. ఈ పరిస్థితుల్లో పాదచారులు గమ్యస్థానాలకు ఎలా చేరుకోవాలో అర్థంగాక అవస్థలు పడుతున్నారు. వాహనాల రద్దీ దృష్ట్యా కొన్నేళ్ల క్రితం కరకంబాడీ రోడ్డును వెడల్పు చేశారు. రాను, పోను వేర్వేరుగా మార్గాలను ఏర్పాటు చేశారు. అదే సమయంలో మధ్యలో డివైడర్, రెండు మార్గాలకు అంచుల్లో పాదచారుల సౌకర్యార్థం ఫుట్‌పాత్‌ను సిద్ధం చేశారు. కాలక్రమేణా ఆ రోడ్డులో



పైకప్పులేకుండా ప్రమాదకరంగా ఉన్న మురుగు కాలువ

జనసంచారం, వాహనాల రద్దీ పెరిగింది. ఇదే అదునుగా భావించిన పలువురు ఫుట్‌పాత్‌లపై చిన్నచిన్న వ్యాపారాలను ప్రారంభించారు. ప్రస్తుతం ఆ రోడ్డు పొడవునా ఫుట్‌పాత్ ఆక్రమణకు గురైంది. దీంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు తక్షణం చర్యలు తీసుకోకుంటే అవస్థలు మరింత పెరిగే అవకాశముందని స్థానికులు చెబుతున్నారు.

మద్యం మత్తులో మహిళపై దాడి



గాయపడిన కనకదుర్గ

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 22: మద్యం మత్తులో తండ్రీకొడుకులు మహిళపై దాడిచేసిన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసు అవుట్ పోస్టు ఏఎస్సై గుర్రప్ప కథనం మేరకు... మంగళం పరిధిలోని సప్తగిరినగర్‌కు చెందిన జయచంద్ర, ఆయన కుమారుడు ఆదివారం పూటుగా మద్యం తాగి ఇంటికొచ్చారు. ఆ మత్తులో పక్కంటి వారితో గొడవపెట్టుకున్నారు. గొడవను చూస్తున్న మూడో ఇంట్లో నివాసముంటున్న కనకదుర్గపై దాడి చేశారు. అడ్డుపడిన ఆమె భర్త రవిపైనా దాడికి పాల్పడ్డారు. 100కు ఫోన్ చేయగా పోలీసులు అక్కడికి చేరుకుని గొడవను నిలుపుదల చేశారు. కనకదుర్గకు గాయాలు కావడంతో రుయా ఆస్పత్రికి తరలించారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమపై అన్యాయంగా దాడి చేశారని రవి కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పరిశీలన గృహంలో బాలుడి మృతి

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 22: మంగళం పరిధిలోని ప్రభుత్వ పరిశీలన గృహంలో ఆదివారం అనారోగ్యంతో బాలుడు మృతి చెందాడు. తిరుచానూరు ఎస్‌ఐ జగన్నాథరెడ్డి కథనం మేరకు.. తమిళనాడు గుడియాత్తంకు చెందిన బాలుడు మార్చినెలలో ఇంటి నుంచి పారిపోయి, భాకరాపేట వద్ద ఇటుక బట్టీలో కూలి పనులు చేసుకుంటున్నాడు. అక్కడున్న ఐదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి, మంగళం పరిధిలోని ప్రభుత్వ పరిశీలన గృహానికి తరలించారు. రెండు రోజుల క్రితం ఆ బాలుడు అనారోగ్యానికి గురవడంతో మంగళంలోని ప్రాథమిక వైద్య కేంద్రంలో చికిత్స చేయించారు. ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో శనివారం మధ్యాహ్నం రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఈ సమాచారాన్ని పోలీసులు బాలుడి తల్లిదండ్రులకు తెలియజేశారు.

కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జిగా సుధాకర్‌రెడ్డి

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 22 : కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా ఇన్‌చార్జిగా ఇ.సుధాకర్‌రెడ్డి నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జుల జాబితాను విడుదల చేశారు. సుధాకర్‌రెడ్డిని జిల్లాలోని పలువురు కాంగ్రెస్ నేతలు అభినందించారు.

కామిరెడ్డి ఆరోపణలు అర్ధరహితం

నెయ్యి కల్తీలో దోషులు తప్పించుకోలేరు: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

పెళ్లకూరు, సెప్టెంబరు 22: కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి ప్రసాదమైన లడ్డూలకు వినియోగించే ఆవు నెయ్యిలో జరిగిన కల్తీనీ తప్పిపుచ్చుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై వైసీపీ నేత కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అర్థ రహితమైన ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ సీనియర్ నాయకుడు పేరం రమేష్ నాయుడు పేర్కొన్నారు. ఆదివారం పెళ్లకూరులో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుజరాత్‌లోని జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ టీటీడీ పంపిన నెయ్యిలో కల్తీ జరిగిందని నిర్ధారించిన విషయాన్నే ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారని గుర్తు చేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి టీటీడీ మాజీ చైర్మన్లను వెనకవేసుకొస్తూ సీఎంపై అర్థ రహిత ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇలాంటి తప్పుడు ఆరోపణలను కామిరెడ్డి మానుకోవాలని, లేకుంటే ప్రభుత్వం తీసుకునే చర్యలతో పాటు ప్రజల ఆగ్రహాలకు గురి కావల్సివస్తుందని హెచ్చరించారు. సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్ మాట్లాడుతూ పెళ్లకూరు మండలం పునబాకలోని వైష్ణవి డెయిరీ నుంచి టీటీడీకి నెయ్యి సరఫరా చేసే టెండర్ దక్కడంలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి హస్తం ఉన్నట్లుందని ఆరోపించారు. ఆ దేవదేవుడికి శఠగోపం పెట్టిన టీటీడీ బోర్డు మాజీ చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, మాజీ ఈవో ధర్మారెడ్డి తప్పించుకోలేరన్నారు. తిరుమల కొండను అవినీతి అక్రమాలను వేదికగా చేసుకున్న వైసీపీ నాయకులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో లక్ష్మీపతి నాయుడు, హరి నాయుడు, మురళీనాయుడు తదితరులు ఉన్నారు.

సీజేఎఫ్ఎస్‌లను రద్దు చేశారు.... పట్టాలు ఇవ్వలేదు

బాలాయపల్లి, సెప్టెంబరు 22: మండలంలోని పేదలకు జీవనోపాధి కోసం గతంలో ప్రభుత్వం సీజేఎఫ్ఎస్ భూములను పంపిణీ చేసింది. ఈ భూముల్లో పంటలు సాగు చేసుకోవడం తప్ప ఎలాంటి రుణాలు పొందలేని పరిస్థితి. దీంతో కొందరు సాగు చేసుకునేందుకు డబ్బులు లేక భూములను బీడుగా వదిలేశారు. మరికొందరు అప్పు చేసి పంటలు సాగు చేసుకుంటున్నారు. భూములున్నా పెట్టుబడులకు డబ్బులు లేక పంటలు సాగుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన ప్రభుత్వం 2018లో సీజేఎఫ్ఎస్ రద్దు చేసి అసైన్డ్ పట్టాలు మంజూరు చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో మండలంలోని సీజేఎఫ్ఎస్ సొసైటీలను రద్దు చేసింది. అయితే రద్దు చేసిన సీజేఎఫ్ఎస్ భూములు రికార్డుల్లో అటవీశాఖకు చెందినవిగా నమోదై ఉండడంతో అంబలపూడి, అరిగేపల్లి, చిలమనూరు, చుట్టి, గొల్లగుంట, జయంపు, నిడిగల్లు, పెరిమిడి, సుబ్రమణ్యం, ఊట్లపల్లి, కడగుంట గ్రామాల ప్రజలకు పట్టాలు మంజూరును నిలిపివేశారు. సీజేఎఫ్ఎస్ రద్దుతో ఎంతోకాలంగా సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు కోల్పోయామని, అయితే అసైన్డ్ పట్టాలు కూడా ఇవ్వకపోవడంతో తాము జీవనోపాధి కోల్పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని తమకు పట్టాలు మంజూరు చేసి హక్కులు కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం



చిల్లకూరులో కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

చిల్లకూరు, సెప్టెంబరు 22: ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతోనే పేదలకు సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చిరంజీవి అన్నారు. ఆదివారం మండలంలోని కలవకొండ గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమం గురించి వివరించారు. విజయవాడలో వరదల సమయంలో బాధితులకు అందుబాటులో ఉంటూ వారి ఎటువంటి కష్టం లేకుండా చూసుకున్న నాయకుడు చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో సుప్రజ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక వడ్డిపాళెం, గొల్లపాళెం ప్రాంతాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, దాసరి రామ్‌ప్రసాద్, బెల్లంకొండ శివ, మల్లికార్జున్, నవీన్‌చంద్ర, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు



క్రీడా పోటీల్లో ఉపాధ్యాయులు

గూడూరు, సెప్టెంబరు 22: స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా క్రీడాపోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. గెలుపొందిన వారు ఈనెల 29న తిరుపతిలో జరిగే జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సుధీర్, రవి, మురళీసింగ్, మురళీమోహన్, నాగేశ్వరరావు, ప్రాణేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆహార పొట్లాల అందజేత

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 22: నాయుడుపేటలోని రైల్వేస్టేషన్, బస్టాండ్, దేవాలయాలు, ముఖ్య కూడలి ప్రాంతాల్లో పేదలకు తడ కండ్రిగకు చెందిన శ్రీకృష్ణ ఫౌండేషన్ నిర్వాహకుడు నాగరాజు ఆహార పొట్లాలు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. తూర్పు గోదావరి జిల్లా మేరీ గ్రామానికి చెందిన చింత చిదానందరావు, చింత వీరభద్రయ్య వారి తండ్రి సూర్యనాగేశ్వరరావు జ్ఞాపకార్థంగా ఆహారాన్ని అందజేసినట్లు తెలిపారు.

కోటమ్మకు పూజలు



కోట, సెప్టెంబరు 22: కోట గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి పండితులు పలు అభిషేకాలుచేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లమూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ముత్యాలమ్మకు...

చిల్లకూరు, సెప్టెంబరు 22: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం పూజలు జరిగాయి. పలు గ్రామాల నుంచి వచ్చి భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

తిరుమల పవిత్రతను భ్రష్టుపట్టించారు

కోట, సెప్టెంబరు 22: తిరుమలను వైసీపీ నాయకులు భ్రష్టుపట్టించారని, ఆ పాపం ఊరికేపోదని టీడీపీ జిల్లా కార్యదర్శి తీగల సురేష్‌బాబు అన్నారు. ఆదివారం కోటలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కలియుగ దైవమైన వెంకటేశ్వరస్వామి ప్రసాదం లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించడం క్షమించరాని నేరమన్నారు. అందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. వైసీపీ ప్రభుత్వం నిర్వాకం వల్ల ప్రపంచవ్యాప్తంగా భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

చిల్లకూరు, సెప్టెంబరు 22: మండలంలోని బూదనం టోల్‌ప్లాజా సమీపంలో ఆదివారం వేకువజామున గుండె పోటుతో లారీ డ్రైవర్ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు... తమిళనాడులోని సేలం జిల్లా కట్టుబొట్టాయ్ గ్రామానికి చెందిన లారీడ్రైవర్ మురగవేల్(35), అతని బావమరిది మణికందన్ సేలం నుంచి కోల్‌కతాకు టెంకాయల లోడు బయలుదేరారు. బూదనం టోల్‌ప్లాజా వద్ద ఆపి లారీపై కప్పిన పట్టను సరిచేసుకుని తిరిగి మళ్లీ బయలుదేరడానికి సిద్ధమయ్యారు. ఇంతలో మురగవేల్ గుండెనొప్పిగా ఉందంటూ అస్వస్థతకు లోనయ్యాడు. వెంటనే గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య శిబిరాలతో పేదలకు ప్రయోజనం

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 22: వైద్య శిబిరాలు నిర్వహించడం వల్ల పేదలకు ప్రయోజనకరంగా ఉంటుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆమె సందర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, పార్థసారధి, వైస్ చైర్మన్ షేక్ రఫీ, నాయకులు పొట్లపూడి రాజేష్, చంద్రశేఖర్, శివ, చక్రపాణి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి చెక్కు అందజేత

గూడూరు, సెప్టెంబరు 22: పట్టణానికి చెందిన మొబైల్ కమ్యూనికేషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.30 వేల చెక్కును ఆదివారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో రామ్మోహన్‌రావు, రాజా, తేజ తదితరులు పాల్గొన్నారు.



శిథిలావస్థలో చిట్టేడులోని బీసీ బాలుర వసతిగృహం మరుగుదొడ్ల దుస్థితి - కిటికీలకు తలుపులు లేని దృశ్యం

నరకానికి నకళ్లు... బీసీ హాస్టళ్లు

కోట, సెప్టెంబరు 22: బీసీ సంక్షేమ వసతి గృహాలు శిథిలావస్థలోకి చేరుకున్నాయి. ఆయా శిథిల భవనాల్లో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ఆయా బీసీ వసతిగృహాలు మళ్లీ ఉరుస్తాయేమోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కోట మండలంలో చిట్టేడులో బీసీ బాలుర, నెల్లూరుపల్లి కొత్తపాళెంలో బీసీ బాలుర, కోటలో బీసీ బాలురు, బాలికల వసతిగృహాలు ఉన్నాయి. వీటిల్లో వందలాది మంది విద్యార్థులు ఉన్నారు. చిట్టేడు వసతిగృహంలో 3నుంచి 10 తరగతుల వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ శిథిలావస్థలో ఉన్న భవనంలోనే సగభాగం వార్డెన్, దాతల సహకారంతో తాత్కలిక మరమ్మతులు చేసి విద్యార్థులను ఉంచుతున్నారు. వర్షానికి ఉరుస్తుండడం, కిటికీలు సక్రమంగా లేకపోవడం, మరుగుదొడ్లు పూర్తిగా దెబ్బతినడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం వస్తే ఈ భవనంలో ఉండాలంటేనే విద్యార్థులు హడలిపోతున్నారు. అదేవిధంగా నెల్లూరుపల్లి కొత్తపాళెంలో ఉన్న బాలుర వసతి గృహం కూడా ఉరిసే పరిస్థితిలో ఉండటంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బీసీ సంక్షేమ హాస్టళ్లకు మరమ్మతులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎన్డీఏ కూటమిది రామరాజ్య పాలన: పాశం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

చిట్టమూరు, సెప్టెంబర్ 22: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి రామరాజ్యం పాలన సాగిస్తోందని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం చిట్టమూరు జడ్పీ హైస్కూల్లో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా గణపర్తి సుబ్రహ్మణ్యం నాయుడు వర్ధంతి సందర్భంగా ఆయన స్థూపం వద్దకు చేరుకొని నివాళులర్పించారు. అనంతరం సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో గూడూరు నియోజకవర్గంలో రూ.2200 కోట్లతో అభివృద్ధి చేశానన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చిన్న పని కూడా చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లో రూ.2కోట్లతో మండలంలో సిమెంట్ రోడ్లు వేస్తున్నట్లు తెలిపారు. రూ.5.33 కోట్లతో బయ్యవారికండ్రిగ నుంచి కొండాపురం రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ ఒకొ క్కటిగా అమలు చేస్తూ రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. వ్యవస్థలను నాశనం చేసిన జగన్ ప్రభుత్వం ప్రతి శాఖలోనూ కోట్ల రూపాయలు దోపిడీ చేసిందని ఆరోపించారు. ప్రధాని మోదీ అండ, చంద్రబాబు అనుభవం, పవన్‌కల్యాన్ సహకారంతో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకపోతోందన్నారు. త్వరతో ఆడపడుచులకు ఉచితంగా మూడు గ్యాస్ సిలండర్లు అందించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకం పార్టీలకతీతంగా ప్రతి పేదవాడికీ అందజేయాలని అధికారులను, నాయకులను కోరారు. మహాపుణ్య క్షేత్రమైన తిరుమల వేంకటేశ్వరస్వామి ప్రసాదం లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిన నెయ్యి వినియోగించడం మహాపాపమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాలెడ్, తహసీల్దారు ప్రసాద్, సర్పంచులు రాజేష్‌రెడ్డి, కోటయ్య, టీడీపీ నాయకులు జనార్దనరెడ్డి, హరికృష్ణారెడ్డి, దువ్వూరు భారతమ్మ, గిరినాయుడు, చెంచు రామయ్య, అనురాధ, చిన్నారావు, బీజేపీ మండల కన్వీనర్ శరత్‌చంద్రారెడ్డి, జనసేన నాయకుడు క్రాంతి, నాగార్జున, అంకబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా చంద్రన్న ప్రభుత్వం: విజయశ్రీ



కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, సెప్టెంబరు 22: చంద్రన్న ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఆదివారం తడ మండలం వాటంబేడు గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేసి సిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న మంచినీళ్లు, డ్రైనేజీ సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. భారీ వర్షాలకు విజయవాడ నగరం ముంపునకు గురైందని, ఆ సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటిని వదిలి కలెక్టర్ కార్యాలయాన్నే సచివాలయంగా మలుచుకొని బాధితులకు అండగా నిలిచారని కొనియాడారు. నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మాటఇస్తే నేరవేర్చడం చంద్రబాబుకే సాధ్యమని, ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్‌ను అమలు చేసిన ఘనత ఆయనదే అన్నారు. అలాగే ఇరకం దీవిలో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మత్స్యకార నాయకులు జయపాల్, వాసు, తదితరులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొమ్మన శ్రీధర్, నాయకులు మురళీరెడ్డి, పార్థసారధి, పళణి, శ్రీనివాసన్, సెల్వం, రవి, మాధవ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖులకు ఎమ్మెల్యే ఆహ్వానం



మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి దంపతులను జాతరకు ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, సెప్టెంబరు 22: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరకు హాజరు కావాలంటూ మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఆయన సతీమణి కోవూరు ఎమ్మెల్యే ప్రశాంత రెడ్డిలను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆదివారం వారి నివాసాలకు వెళ్లి ఆహ్వానించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

గూడూరు, సెప్టెంబరు 22: బలిజ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవాసమితి కృషి చేస్తుందని ఆ సంఘ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక త్యాగరాజవీధిలోని ఓ ప్రైవేటు ఫక్షన్ హాలులో ప్రభుత్వం నుంచి ఉత్తమ సేవా అవార్డులు పొందిన బలిజ ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగస్థులకు ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా నాయకత్వం దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సారంగం శ్రీనివాసులు, మునిశేఖర్, సత్యనారాయణ, బాలసుబ్రమణ్యం, రవీంద్రబాబు, శేషయ్య, కళ్యాణ్ సాయి, ఎంవీ రమణయ్య, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వర్లు

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 22: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర పోస్టర్లను ఎన్‌వీఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ వెంకటేశ్వర్లు, పునుగోటి విశ్వనాథం, మురళీకృష్ణ పాల్గొన్నారు.

వృద్ధ దంపతులకు బలిజ సంఘం చేయూత

నాయుడుపేట, సెప్టెంబరు 22: ఆరోగ్య, ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న జానకీరామయ్య, రాజేశ్వరమ్మ దంపతులకు బలిజ ఐక్యవేదిక సంఘ నాయకులు చేయూత అందించారు. ఆదివారం వృద్ధ దంపతులకు రూ.15వేల నగదు, దుస్తులు, మందులు, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు ఏవీ కుమార్, ఆకుల కుబేరు మణి, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, గిరి, జయప్రకాష్, సురేంద్ర, శేషగిరి, రోహిణి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ



చిల్లకూరులో కరపత్రాలను అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి తదితరులు

పెళ్లకూరు, సెప్టెంబరు 22: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తవడంతో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తూరులో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, పెళ్లకూరులో సీనియర్ నాయకుడు పేరం రమేష్ నాయుడు, బంగారంపేటలో దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, వెంకట సుబ్బయ్య, భీమవరంలో దామెర ప్రసాద్‌నాయుడు, జీలపాటూరులో కందమూడి శివకుమార్, చిల్లకూరులో పాపాడి రాజగోపాల్‌రెడ్డి, పునబాకలో వేలూరు హరి నాయుడు, తాళ్ల యుగంధర్, రోసనూరులో దొమ్మరాజు సత్యంరాజు తదితరులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు.

ఓజిలి: మండలంలోని 10 సచివాలయాల పరిధిలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. అధికారులు ఇంటింటా పర్యటించి కూటమి ప్రభుత్వం వంద రోజుల పరిపాలనలో సాధించిన విజయాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈకార్యక్రమాలను ఎంపీడీవో రజనీకాంత్ పర్యవేక్షించారు. అలాగే కురుగొండ సచివాలయం పరిధిలో ఎంఈవో చంద్రశేఖర్ అధికారులతో కలసి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించండి

గూడూరు అర్బన్, సెప్టెంబరు 22: రాష్ట్రప్రభుత్వం కార్మికులు, చిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్ర హ్మణ్యం అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కార్మికుల పట్ల అనుచితంగా వ్యవహరిస్తూ వారి హక్కులను కాలరాసిందన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపట్టకపోతే ఐక్యపోరాటాలు సాగించాల్సి వుంటుందన్నారు. కార్యక్రమంలో ఇంద్రావతి, గోపాల్, శివకుమార్, బీవీ రమణయ్య, సురేష్, ముత్యాలయ్య, మణి, చంద్రయ్య, పెంచలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రయోగాలపై శిక్షణ ఇవ్వాలి

తిరుపతి(విద్య), సెప్టెంబరు22: ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని జూనియర్ కళాశాలల్లో జనరల్ సైన్స్, వొకేషనల్ కోర్సులు చదివే విద్యార్థులు తప్పనిసరిగా ప్రయోగ తరగతులు నిర్వహించాలని ప్రాంతీయ ఇంటర్మీడియట్ బోర్డు పర్యవేక్షణాధికారి(ఆర్ఐవో) జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ విషయమై ఈ నెల 4న జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు నిర్వహించిన సమావేశంలో వివరించామని తెలిపారు. ఏ కళాశాలలోనైనా ప్రాక్టికల్స్ నిర్వహించడంలేదని సమాచారం అందితే బోర్డు నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎస్వీయూ అడ్మిషన్ల విభాగానికి నూతన సారథ్యం

నేడు కొత్త అధికారుల బాధ్యతల స్వీకరణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 22: ఎస్వీయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ (డీఓఏ) విభాగానికి నూతన అధికారులు సారథ్యం వహించనున్నారు. ఇప్పటి వరకూ డీవోఏ డైరెక్టర్‌గా ఇంజినీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ శ్రీమురళి వ్యవహరించారు. సోమవారం ఆయన ఆ బాధ్యతల నుంచి వైదొలగనున్నారు. నూతన డీవోఏ డైరెక్టర్ వర్సిటీ సౌత్ ఈస్ట్ ఏషియన్ అండ్ పసిఫిక్ స్టడీస్ (సీప్) ప్రొఫెసర్ వూకా రమేష్‌బాబు, జాయింట్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ మధు(జియాలజీ), అసిస్టెంట్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ శంకర గణేష్ (ఫైన్ ఆర్ట్స్ విభాగం) నియమితులయ్యారు. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు ఉత్తర్వులు వెలువరించారు. సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

డివైడర్‌పై నక్కలోళ్ల దుకాణాలు దగ్ధం

రూ.2 లక్షల ఆస్తి నష్టం



దగ్ధమైన దుకాణాలు

నాయుడుపేట, సెప్టెంబరు 22: నాయుడుపేట ప్రభుత్వాస్పత్రి ఎదుట డివైడర్లపై ఉన్న నక్కలోళ్ల దుకాణాలు ఆదివారం తెల్లవారుజామున అగ్నికి ఆహుతయ్యాయి. పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట దాదాపు 50 సంవత్సరాలుగా నక్కలోళ్లు దుకాణాలు, నివాసాలు ఏర్పరుచుకొని నివసించేవారు. సదరు స్థలం ఓ ప్రైవేట్ వ్యక్తికి చెందినదని కోర్టు తీర్పు ఇవ్వడంతో అధికారులు స్థలాన్ని అప్పగించారు. దీంతో నిరాశ్రయులైన నక్కలోళ్లు డివైడర్లపై దుకాణాలు, గుడారాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారు. అయితే ఆదివారం తెల్లవారుజామున దుకాణాలు దగ్ధమయ్యాయి. ఇది ప్రమాదం వల్ల జరిగిందా... లేక ఎవరైనా ఉద్దేశపూర్వకంగా నిప్పంటించారా అన్నది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. కాగా, అగ్ని ప్రమాదంలో మూడు దుకాణాలు పూర్తిగా దగ్ధమయ్యాయని, వాటి విలువ దాదాపు రూ.2 లక్షలు ఉంటుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుకాణాలు పూర్తిగా దగ్ధం కావడంతో జీవనోపాధి కోల్పోయామని, ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలంటూ నక్కలోళ్లు కోరుతున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే కార్డెన్ సెర్చ్

గూడూరు, సెప్టెంబరు 22: శాంతిభద్రతల పరిరక్షణ కోసమే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ రమణకుమార్ అన్నారు. ఆదివారం గాంధీనగర్ సమీపంలోని టిడ్కో గృహాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ శివారు ప్రాంతాల్లో నేరాలు అదుపు చేసేందుకు తనిఖీలు చేపట్టామన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తుల సంచారం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గంజాయి విక్రయం, అక్రమణ రవాణా, రౌడీయిజాన్ని అరికట్టేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సీఐలు శేఖర్‌బాబు, శ్రీనివాస్, ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డిపాలెంలో...

పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరు వడ్డిపాలెంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో ఇంటింటినీ తనిఖీ చేశారు. పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ చెంచుబాబు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. అనుమానితులు ఎవరైనా గ్రామంలో సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐ సంగమేశ్వరరావు, ఎస్ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ పీడీగా శోభన్‌బాబు



తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 22: తిరుపతి జిల్లా డీఆర్‌డీఏ పీడీగా టి.ఎస్.శోభన్‌బాబును నియమిస్తూ ఆదివారం రాత్రి రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు విడుదల చేశారు. ఆయన ప్రస్తుతం చిత్తూరు జిల్లా నగరి క్లస్టర్ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (డ్వామా) ఏపీడీగా పనిచేస్తున్నారు. ఆరు నెలల క్రితం డీఆర్‌డీఏ పీడీగా పనిచేస్తున్న జ్యోతి ఉద్యోగ విరమణ పొందారు. అప్పటి నుంచి ఇన్‌చార్జి పీడీగా ప్రస్తుతం ఏపీడీగా ఉన్న ప్రభావతి విధులు నిర్వహిస్తున్నారు. శోభన్‌బాబు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ చంద్రగిరి, వడమాల, రామచంద్రాపురం ప్రాంతాల్లో ఎంపీడీవోగా పని చేశానని, జిల్లాపై అవగాహన ఉందని అన్నారు. శ్రీవారి చెంత పనిచేయడం సంతోషంగా ఉందన్నారు.

రెగ్యులర్ డీపీవోగా సుశీలాదేవి



తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 22: తిరుపతి జిల్లా గ్రామ పంచాయతీ ఆఫీసర్‌గా సుశీలాదేవిని నియ మిస్తూ పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆమె డీఎల్‌డీవోగా విధులు నిర్వహిస్తున్నారు. రెండు న్నర నెలలుగా ఇన్‌చార్జి డీపీవోగా వ్యవహరిస్తున్నారు. ఎట్టకేలకు రెగ్యులర్ డీపీవోగా సుశీలాదేవిని నియ మించారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం అందించే పథకాలను ప్రజలకు చేరువ చేస్తామని ఆంధ్రజ్యోతితో చెప్పారు.

కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జిగా సుధాకర్‌రెడ్డి

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 22: కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా ఇన్‌చార్జిగా ఇ.సుధాకర్‌రెడ్డి నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జుల జాబితాను విడుదల చేశారు. సుధాకర్‌రెడ్డిని పలువురు కాంగ్రెస్ నేతలు అభినందించారు.

కలగా మిగిలిన పూడి వంతెన నిర్మాణం

కేవీబీపురం, సెప్టెంబరు 22: మండలంలోని పూడి సహా సమీప గ్రామాలకు చేరుకోవడానికి మట్టి వంతెనకు బదులు శాశ్వత నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు చేశారు. అయితే అవి కాగితాలకే పరిమితమయ్యాయి. గత ప్రభుత్వాల హయాంలో కూడా పూడి వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదనలు పంపారు కానీ కార్యరూపం దాల్చలేదు. యేటా వర్షాకాలంలో కాళంగి యేరు పొంగడం ఈ మట్టి వంతెన కొట్టుకుపోవడం పరిపాటిగా మారింది. కొట్టుకుపోయిన ప్రతి సారీ అధికారులు పరిశీలించి వెళ్తున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదు. గత యేడాది డిసెంబరులో వంతెన కొట్టుకుగా ఎమ్మెల్యే ఆదిమూలం పరిశీలించి వంతెన నిర్మించాలని అప్పటి సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కూడా పట్టించు కోలేదు. వర్షాలు వచ్చి ఈ మట్టి వంతెన కొట్టుకుపోతే పూడి సహా దాని చుట్టుపక్కల గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి శాశ్వత నిర్మాణం చేపట్టాలని పూడి, ఎగువపూడి, దిగువపూడి, పూడి సీకేపురం, పోలినాయుడుకండ్రిగ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.




ప్రస్తుతం పూడి గ్రామాలకు వెళ్లే మట్టి వంతెన - డిసెంబరులో వచ్చిన వర్షాలకు వంతెనపై పారుతున్న నీరు

సజ్జ పంటకు గిట్టుబాటు ధర కల్పించండి

కేవీబీపురం సెప్టెంబరు 22: రైతు పండించే సజ్జ పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘ తిరుపతి జిల్లా అధ్యక్షుడు జనార్దన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సజ్జ పంటకు మద్దతు ధర క్వింటాలుకు రూ.2625 ఆర్భాటంగా ప్రకటించి ఆచరణలో విఫలమైందన్నారు. ప్రతి మండలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఇంత వరకు పట్టించుకోలేదన్నారు. దీంతో రైతుల వద్ద నుంచి దళారులు క్వింటాల్ రూ.2,100కే కొనుగోలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

● తిరుమల లడ్డూ వివాదం

చెవిలో పూలతో టీడీపీ నిరసన



నిరసన కార్యక్రమంలో టీడీపీ నాయకులు

ఏర్పేడు, సెప్టెంబరు 22: రివర్స్ టెండరింగ్ పేరుతో తిరుమల శ్రీవారి లడ్డూను నాసి రకం నెయ్యితో తయారు చేయడంపై టీడీపీ నాయకులు చెవిలో పూలు పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని వినాయకస్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి మాట్లాడుతూ... వేంకటేశ్వర స్వామి ప్రసాదాల తయారీలో జంతువుల కొవ్వు కలిపిన నెయ్యితో ప్రసాదాలు తయారు చేయించి స్వామివారికి నివేదించి హిందువుల మనోభావాల్ని, హిందూ ధర్మాన్ని మంట కలిపిందని మాజీ సీఎం జగన్‌పై విరుచుకుపడ్డారు. వైసీపీ హయాంలో టీటీడీ ఛైర్మన్లుగా వ్యవహరించి తిరుమల పవిత్రతను మంటగలిపిన వై.వీ.సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, ఈవోగా పనిచేసిన ధర్మారెడ్డి పై చట్టపరంగా విచారణ జరిపించి శిక్షించాలని కోరారు. కృష్ణవేణి, రాచేటి సుబ్రమణ్యం, సుబ్రమణ్యం, రమణ, మునెయ్య, నరసింహ నాయుడు, రమణయ్య, మునీంద్ర యాదవ్, శ్రీనివాస్ యాదవ్, బాలాజి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు మెరుగుపరచండి

పిచ్చాటూరు, సెప్టెంబరు 22: మండల పరిధిలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను మెరుగు పరచాలని వినియోగదారులు కోరుతున్నారు. మూడు రోజుల క్రితం 4జీ సేవల పనులను సిబ్బంది చేపట్టారు. ఈ క్రమంలో నెట్‌వర్క్‌ను పూర్తిగా ఆపేశారు. ఈ క్రమంలో మూడు రోజుల తరువాత 4జీ నెట్‌వర్క్‌ను ప్రారంభించినా సిగ్నల్స్ సరిగా లేవని ఫలితంగా ఆన్‌లైన్ సేవలు దాదాపు ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సత్వరం స్పందించి నాణ్యమైన 4జీ సిగ్నల్స్ అందించాలని పలువురు వినియోగదారులు కోరుతున్నారు.

గాంధీ విగ్రహం ఏర్పాటు పనులు ప్రారంభం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 22: వాహన మండపానికి అడ్డంగా ఉందన్న నెపంతో తొలగించిన గాంధీ విగ్రహ ఏర్పాటుకు ఎట్టకేలకు అధికారులు పనులు ప్రారంభించారు. పట్టణంలోని రాజగోపురం ఎదుట ఎన్నో దశాబ్దాలుగా గాంధీ విగ్రహం ఉండేది. జనవరిలో వాహన మండపానికి అడ్డంగా ఉందని విగ్రహాన్ని తొలగి ఆ తర్వాత ఏర్పాటును విస్మరించారు. దీనిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమైనా గత పాలకులు, అధికారుల నుంచి కనీస స్పందన రాలేదు. గాంధీ విగ్రహాన్ని రాజగోపురం ప్రాంతంలోనే తిరిగి ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఎన్నికల సందర్భంగా ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ మేరకు పురపాలక అధికారులు పనులు ప్రారంభించారు.

1వ వార్డులో కార్డన్ సెర్చి



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 22: పట్టణంలోని 1వ వార్డు పరిధిలో ఆదివారం వేకువ జమున పోలీసులు సోదాలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ నరసింహమూర్తి కార్డెన్ సెర్చి నిర్వహించేందుకు సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలతో సిబ్బందిని సమాయత్తం చేశారు. సోదాలు నిర్వహించ బోయే చివరి నిమిషంలో ఎంపిక చేసిన ప్రాంతాన్ని వెల్లడించారు. పోలీసు బలగాలు 1వ వార్డును ముట్టడించి ఏకకాలంలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. రికార్డుల్లేకుండా ఉన్న ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని 2వ పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీఐలు వెంకటేశ్వర్లు, గోపి, రవి నాయక్, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి మహోన్నతం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 22: భావితరాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. శ్రీకాళహస్తి కి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మురళి ఇటీవల డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం మురళిని సత్కరించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గురవయ్య పాల్గొన్నారు.

సంక్షేమ సృష్టికర్త ప్రధాని మోదీ



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 22: ప్రధాని నరేంద్ర మోదీ సంక్షేమ పథకాల సృష్టికర్త అని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా ఆదివారం మండలంలోని గద్ద గుంటలో అన్నదానం నిర్వహించారు. బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ ఎం. సుబ్ర మణ్యం రెడ్డి, టీడీపీ నాయకుడు మురళీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 22: హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహ మూర్తి అన్నారు. పట్టణంలోని నగిరి వీధిలోని సంస్థ కార్యాలయం వద్ద ఆదివారం ప్రత్యేక ప్రతిభావంతులకు డీఎస్పీ చేతులమీదుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సంస్థ నిర్వాహకులు మునీర్ బాషా, న్యాయవాదులు రాజేశ్వరరావు, జి. రమేష్, కె.ఉదయ్, టీడీపీ మైనార్టీ సెల్ నాయకుడు షాకీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ నిల్వలపై పోలీసు దాడులు



వరదయ్యపాళెం, సెప్టెంబరు 22: మండలంలోని గూడలవారిపాళెం పంచాయతీ సమీపంలో అరుణా నది నుంచి అనుమతి లేకుండా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించి సీఆర్సీ కండ్రిగ సమీపంలో డంప్ చేస్తున్నారు. కొందరు ఈ ఇసుకను తమిళనాడుకు తరలిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి శనివారం రాత్రి సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఇసుకు సీజ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రాజశేఖర్‌కు సమాచారం అందించారు.

ఆర్టీసీ కార్గో ఏజెంట్‌పై దాడి

వరదయ్యపాళెం, సెప్టెంబరు 22: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో పీఎస్ఆర్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ పార్కింగ్ చేసి వెళ్లాడు. అరగంట తర్వాత వచ్చిన డ్రైవర్‌ని బస్టాండులోని స్వీట్ షాప్ యాజమాని, ఆర్టీసీ కార్గో ఏజెంట్ డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. దీంతో ఆగ్రహించిన ప్రైవేట్ బస్సు డ్రైవర్ భాస్కర్ కార్గో ఏజెంట్ రాంబాబును దుర్భాషలాడుతూ దాడి చేశాడు. రాంబాబు సత్యవేడు ఆర్టీసీ డిపో మేనేజర్‌కు సమాచారం ఇచ్చాడు. దీనిపై డిపో మేనేజర్ వరదయ్యపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా ప్రైవేట్ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జున్ తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో కొరవడిన పారిశుధ్యం

మురుగుకాలువలు లేక వీధుల్లో ప్రవహిస్తున్న వ్యర్థపునీరు




పాగాలి గ్రామంలో రొచ్చురొచ్చుగా ఉన్న సిమెంటు రోడ్డు - చిందేపల్లిలో సిమెంటు రోడ్డు దృశ్యం

ఏర్పేడు, సెప్టెంబరు 22: గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామీణ ప్రాంతాలను పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో అభివృద్ధి కుంటుపడింది. మురుగు నీటి కాలువలు లేక వ్యర్థపు నీరు వీధుల్లో ప్రవహిస్తోంది. దీంతో అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. ఏర్పేడు మండలంలో చిందేపల్లి దళితవాడలో మురగు కాలువలు లేక వ్యర్థపు నీరు వీధుల్లో ప్రవహిస్తోంది. దీంతో ఈ మార్గంలో పరిశ్రమలకు వెళ్లే కార్మికులు, పనుల మీద వెళ్లే ప్రజలు, వ్యాపారులు ఇబ్బంది పడు తున్నారు. అదే విధంగా పాగాలి, మేర్లపాక పంచాయతీలో కూడా ఇదే పరిస్థితి. మఠ్రిమంద దళితవాడ, రావిళ్లవారి కండ్రిగలోనూ మురుగుకాలువలు లేవు. పారిశుధ్యాన్ని మెరుగుపరచాలంటే ప్రతి గ్రామంలో వీధులకు ఇరువైపులా మురుగ నీటి కాలువలు నిర్మించాల్సి ఉంది. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాల్సి ఉంది.



కరపత్రాల ఆవిష్కరణలో డీఎస్పీ తదితరులు

రోడ్డు భద్రతతోనే ప్రాణ రక్షణ

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 22: రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తే ప్రమాదాలతోపాటూ ప్రాణ నష్టాన్ని నివారించవచ్చని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. పట్టణంలోని పెళ్లి మండపం కూడలి వద్ద యంగ్ ఎంపాయీస్ సోషల్ సర్వీసెస్ స్వచ్ఛంద సంస్థ నిధులతో ముద్రించిన రోడ్డు భద్రత నియమాల కరపత్రాలు, బ్యానర్లు, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... వాహనాలు నడిపే సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు ప్రయాణికులు సీటు బెల్టు విధిగా ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం బాధ్యతారాహిత్యమన్నారు. అనంతరం ట్రాఫిక్ సిబ్బందికి హెల్మెట్లు, రేడియం జాకెట్లు, కంటి అద్దాలు, రెయిన్ కోట్లు అందజేశారు. హేమకుమార్, సాయి కిరణ్, ప్రదీప్ కుమార్, మునస్వామి, సీఐ గోపి పాల్గొన్నారు.

ఇబ్బందులను అధిగమించి అభివృద్ధి వైపు పయనం



పిచ్చాటూరులో కరపత్రాల పంపిణీలో టీడీపీ నాయకులు తదితరులు

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 22: రాష్టంలో అర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వంద రోజుల్లో సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు పరిచి ప్రజలకు సంక్షేమాన్ని అందించారని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కన్నయ్యనాయుడు తెలిపారు. మండలంలోని నెలవాయిలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వంద రోజుల్లో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఓ మురళి, కార్యదర్శి నాగరాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 3వ రోజు ఆదివారం పిచ్చాటూరు, అడవి కొడియంబేడుల్లో టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనుల కరపత్రాలను పంపిణీ చేశారు. దీపావళికి ఉచిత సిలిండర్ అందిస్తున్నామని చెప్పారు. పార్టీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, నాయకులు వెంకటేశులు నాయుడు, రవి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

రైతు మహాసభకు తరలి రండి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 22: బలరామ జయంతి పురస్కరించుకుని ఈనెల 24న జరగబోయే రైతు మహాసభకు తరలిరావాలని శ్రీకాళహస్తి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ డైరెక్టర్ దశరథాచారి పిలుపునిచ్చారు. పట్టణంలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా దేశవ్యాప్తంగా విస్తరించిన భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ పర్యవేక్షణలో శుకబ్రహ్మ ఆశ్రమంలో 24వ తేదీన 10 గంటలకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మధుర ప్రాంతానికి చెందిన గురు శరణానందాజీ చేతుల మీదుగా సభ ప్రారంభమవుతుందని తెలిపారు. మారుతున్న కాలానుగుణంగా ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రకృతి రైతు జలగం శ్యామ్, ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ సీఈవో జయచంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో పొట్టేళ్ల మృతి



వరదయ్యపాళె, సెప్టెంబరు 22: మండలంలోని సీఎల్ఎన్ పల్లిలో కుక్కల దాడిలో 15 పొట్టేళ్లు మృతి చెందడంతో రైతులు లబోదిబో మంటున్నారు. గ్రామానికి చెందిన ఎస్టీకాలనీలోని వి.రామకృష్ణయ్య, లక్ష్మయ్య, వేమయ్య పొట్టేళ్ల పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శనివారం కాలనీ సమీపంలోని అరికసేను వద్ద క్వారీలో పొట్టేళ్లు మేత మేస్తుండగా హఠాత్తుగా కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో 15 జీవాలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో ఏడు గాయపడ్డాయి.

సహాయాల పంపిణీ



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 22: జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి వినుత భర్త చంద్రబాబు జన్మదిన వేడుకలను ఆ పార్టీ శ్రేణులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముక్కంటి ఆలయ గోశాలకు చంద్రబాబు పశుగ్రాసం వితరణ చేశారు. పెళ్లి మండపం కూడలి వద్ద అన్నదానం చేశారు. అమ్మ ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఇక శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ అందించారు. వినుత తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



రాహుకేతు పూజల్లో భర్తతో నమిత

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 22: శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. హీరోయిన్ నమిత కుటుంబ సమేతంగా ముక్కంటి ఆలయానికి వచ్చేసారు. అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయంలోని సహస్ర లింగం వద్ద ఆమె రాహు కేతు సర్పదోష నివారణ పూజలను చేశారు. అనంతరం స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. కాగా ఉత్తరప్రదేశ్ సీఎంవో ప్రిన్సిపల్ కార్యదర్శి సంజయ్ సింగ్ కుటుంబ సమేతంగా ముక్కంటిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

స్వీయ క్రమశిక్షణతోనే ఉన్నత జీవితం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 22: స్వీయ క్రమశిక్షణతోనే ఉన్నత జీవితం సాధ్యమని బీసీ సంక్షేమ జిల్లా అధికారి చంద్రశేఖర్ అన్నారు. తొట్టంబేడు బీసీ బాలికల వసతి గృహంలో ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం, స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొబ్బరి చెట్లను నాటారు. అనంతరం చదువుపై ఏకాగ్రత, స్వీయ క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వార్డెన్ విజయ కుమారి మాట్లాడుతూ... విద్యతోనే పేదరికాన్ని దూరం చేయవచ్చన్నారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు.

కుర్రకాలువ రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి



రేణిగుంట, సెప్టెంబర్ 22: మండలంలోని కుర్రకలువ ప్రధాన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. రేణిగుంట మండలం జీపాళెం పంచాయతీ పరిధిలోని కుర్రకాలువ ప్రధాన రహదారి గోతులమయంగా మారింది. ప్రధానంగా ఈ రోడ్డు మీదుగా పరిశ్రమలకు, గుడిమల్లం ఆలయానికి, పాపానాయుడు పేటకు రాకపోకలు సాగించే వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

బీజేపీ జాతీయ కార్యదర్శికి సాదర స్వాగతం



అరవింద్‌కు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

రేణిగుంట, సెప్టెంబరు 22: బీజేపీ జాతీయ కార్యదర్శి అరవింద్ మీనన్‌కు తిరుపతి విమానాశ్రయంలో ఆ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆదివారం శ్రీవారి దర్శనార్థం ఢిల్లీ నుంచి ఎయిర్ ఇండియా విమానంలో కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఆయనకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్, రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్, నాయకులు చంద్రప్ప, సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన ఆయన కుటుంబీకులతో తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

27న పుత్తూరులో జాబ్‌మేళా

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 22: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజ్, సీడాప్, డీఆర్డీఏల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 27న పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా జరుగుతుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్ తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన 18-35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన మహిళలు, పురుష అభ్యర్థులు హాజరుకావచ్చని తెలిపారు. పలు ప్రముఖ కంపెనీలు పాల్గొనే ఈ జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు నెం.6300954441, 7993502145లలో సంప్రదించాలని కోరారు.

కంటి వైద్య ఉచిత శిబిరం



వరదయ్యపాళెం, సెప్టెంబరు 22: మండలంలోని కాం బాకం పంచాయతీలో అవంతి లెదర్స్ కంపెనీ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆ పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో జరి గిన శిబిరంలో ఎస్వీ అరవింద్ వైద్యశాల డాక్టర్లు 147 మందికి పరీక్షలు నిర్వహించారు. 24 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వైద్యులు భవ్య, అవంతి, సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పెళ్లకూరు చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వర అరవింద్ నేత్రాలయ సహకారంతో జరిగిన వైద్య శిబిరంలో 170 మందికి పరీక్షలు నిర్వహించారు. 75 మందికి మందులు, 40 మందికి అద్దాలు పంపిణీ చేశారు. 30 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు సీఈవో సీతారామనాయుడు తెలిపారు. డాక్టర్ కీర్తన పరీక్షలు నిర్వహించారు.

విద్యార్థులు పరిశుభ్రతను పాటించాలి



బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 22: విద్యార్థులు పరిసరాలతో పాటూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారి చంద్రశేఖర్ సూచించారు. మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ వసతి గృహంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... వసతి గృహాలు, పాఠశాలలు, కార్యాలయాలు, గ్రామాన్ని పరిశుభ్రంగా పెట్టుకోవాలన్నారు. అందుకోసం విద్యార్థులు తమ వంతుగా వారంలో ఒక రోజు దానికి కేటాయించాలన్నారు. వార్డన్ రామయ్య పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల కార్యవర్గం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 22: శ్రీకాళహస్తి బ్రాంచ్ పరిధిలోని ఎల్ఐసీ ఏజెంట్ల యూనియన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం ఏజెంట్ల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా నారాయణస్వామిని, కార్యదర్శిగా బాబురావును, ట్రెజరర్‌గా ఈశ్వర్ తదితర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు శ్రీమన్నారాయణ, ఉపాధ్యక్షుడు రామచంద్రారెడ్డి, జోనల్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి డివిజన్ అధ్యక్షుడు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.